ఉష్ణోగ్రత (అంచనా)

27-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	35	27
నరసరావుపేట	35	26
బాపట్ల	34	27
రెంటచింతల	36	27
చీరాల	34	27

కాసుల పారుదల కనిపించడం లేదు!


మేజర్ కాలువలో పెరిగిన కంప చెట్లు

- నిలిచిపోయిన కాల్వల మరమ్మతులు, పూడిక తీత
- ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు
- రూ 19.28 కోట్ల ప్రతిపాదనలపై మీనమేషాలు
- బిల్లులపై నమ్మకం ఉంటే పనులు చేయండి
- చేతులెత్తేసిన జలవనరుల శాఖ అధికారులు
- పనులకు ధైర్యం చేయని సాగునీటి సంఘాలు


షట్టరు లేని తూము

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలోని మేజర్లు.. మైనర్లు.. సబ్ మైనర్ కాలువలు అధ్వానంగా మారాయి. కాల్వల చివరి ఆయకట్టుకు పూర్తి స్థాయిలో సాగు నీటి పారుదల పరిస్థితులు కనిపించడం లేదు. విత్తు సమయం అసన్నమయ్యే లోగా కాల్వల్లో పూడికతీతతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అత్యవసర మరమ్మతులు చేపట్టి పూర్తి చేయాల్సి ఉంది. ఈ దిశగా జలవనరుల శాఖ ఇంకా స్పందించడం లేదు. ఒక్క రూపాయి కూడా విడుదల చేయకపోవడంతో కాల్వల పనుల నిర్వహణ సందిగ్ధంలో పడింది. ఈ ఏడాదికి మరమ్మతులు లేనట్లేనా అన్న


రూపురేఖలు కోల్పోయిన మైనర్ కాలువ

ప్రశ్న అన్నదాతల నుంచి వ్యక్తమవుతోంది. నీటి సంఘాలు పనులు చేయవచ్చని ప్రభుత్వం సూచించినా.. నిర్వాహకులు ముందుకు రావడం లేదు. నిధులు మంజూరు చేయకుండా పనులు చేపట్టలేమని వారు చెబుతున్నారు.

వర్షాలతో పనులకు ఆటంకం

రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రెండు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరిస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో కాలువల పనుల నిర్వహణకు ఆటంకం ఏర్పడే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే పనుల విషయంలో కాలయాపన జరిగింది. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు చేపట్టేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అన్నదాతల మొర ఆలకించే పరిస్థితి కానరావడం లేదు.

ప్రతిపాదనలకు స్పందన లేదు

కాలువల్లో చేపట్టాల్సిన అత్యవసర పనులు గుర్తించిన జలవనరుల శాఖ ప్రభుత్వానికి రూ 19.28 కోట్లు వ్యయం అంచనాలతో ప్రతి పాదనలు పంపింది. నిధుల విడుదలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో పనుల నిర్వహణ సందిగ్ధంలో పడింది. వైసీపీ పాలనలో ఐదేళ్ల కాల్వల మరమ్మతులు చేపట్టక వాటిని అధ్వానంగా మార్చేసింది. కాల్వల్లో కంప చెట్లు పెద్ద ఎత్తున పెరిగాయి. జమ్ము, తూటు కాడ, రబ్బరు మొక్కలు నిండా అల్లుకుపోయాయి. డ్రాపులు పగిలిపోయాయి. షట్టర్లు కూడా దెబ్బతిన్నాయి, కాల్వలకు నీరు విడుదల చేసేందుకు షట్టర్లు లేవు. దీంతో సాగు నీరు వృథాగా వాగుల్లో పారుతోంది.

చేతులెత్తేసిన జలవనరుల శాఖ

కాలువల మరమ్మతులు నెలాఖరులోగా పూర్తి చేయాలి.. యుద్ధ ప్రాతిపదికన కాల్వల్లో పూడిక తీత పనులు చేపట్టాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటన చేశారు. ఇది ఆచరణలో సాధ్యం కాదనే చెప్పాలి. మరమ్మతులకు నిధులు విడుదల చేయకుండా నెలాఖరుకు పనులు ఎలా పూర్తవుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. 'పనులు చేశాక డబ్బు వస్తుందనే ధైర్యం ఉంటే కాల్వల పనులు చేయండి. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే వరకు ఒక వేళ పనులు చేసినా.. మేము నమోదు చేసేది ఏమీ లేదు.' అని జలవనరుల శాఖ అధికారులు సాగునీటి సంఘాలకు చెప్పి.. చేతులెత్తేశారు. దీంతో పనులు చేసేందుకు నీటి సంఘాలు జంకుతున్నాయి.

355 పనులు.. రూ.19.28 కోట్లు

వినుకొండ, లింగంగుంట్ల, సత్తెనపల్లి, మాచర్ల డివిజన్‌లలో అత్యవసర మరమ్మతులకు సంబంధించి 355 పనులను గుర్తించారు. ఈ పనులు చేపట్టేందుకు రూ 19.28 కోట్లు వ్యయం అంచనా వేశారు. మాచర్ల నియోజకవర్గ పరిధిలోని కాలువల మర్మతులకు సంబంధించి 38 పనులు గుర్తించారు. ఈ పనుల నిర్వహణకు రూ.2.17 కోట్లు వ్యయం అంచనా రూపొందించారు. గురజాల నియోజకవర్గం పరిధిలో 31 పనులకు రూ.2.17 కోట్లు, సత్తెనపల్లి నియోజకవర్గంలో 46 పనులకు రూ.2.34 కోట్లు, పెదకూరపాడు నియోజకవర్గంలో 36 పనులకు రూ.2.16 కోట్లు, తాడికొండ నియోజకవర్గంలో 34 పనులకు రూ.2 కోట్లు, నరసరావుపేట నియోజకవర్గంలో 51 పనులకు రూ.2.30 కోట్లు, చిలకలూరిపేట నియోజకవర్గంలో 29 పనులకు రూ.1.45 కోట్లు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో 25 పనులకు రూ.1.49 కోట్లు, వినుకొండ నియోజకవర్గం పరిధిలో 54 పనులకు రూ.2.70 కోట్లు, దర్శి నియోజకవర్గంలో 5 పనులకు రూ.20.48 లక్షలు, అద్దంకి నియోజకవర్గం పరిధిలో 6 పనులకు రూ.26.56 లక్షలుగా అంచనా రూపొందించారు. ఈ మేరకు జలవనరుల శాఖ నిధులు విడుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.

బర్లీ బ్లాక్..!

- జిల్లాలో 52 వేల టన్నుల నల్ల బర్లీ నిల్వలు
- కొనుగోళ్లు లేక రైతులు విలవిల
- ఉద్యమ బాటలో కర్షకులు
- నేడు చిలకలూరిపేటలో నిరసన దీక్ష

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): కొనుగోళ్లు లేక జిల్లాలో బ్లాక్ బర్లీ పొగాకు నిల్వలు భారీగా పేరుకుపోయాయి. పత్తి కలసిరావడం లేదని పొగాకు సాగు చేసిన రైతులకు దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. పంట ఇంటికి చేరే నాటికి ధరలు పడిపోయాయి. నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు విలవిల్లాడి పోతున్నారు. పొగాకు కొనుగోళ్లకు చర్యలు తీసుకోవాలని పాలకులను పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా.. వీరి మొర ఆలకించకపోవడంతో ఉద్యమ బాట పట్టారు. చిలకలూరిపేటలోని ఐటీసీ సంస్థ కార్యాలయం వద్ద మంగళవారం పొగాకు రైతులు నిరసన దీక్షకు సిద్ధమయ్యారు.


పొగాకు

52 వేల క్వింటాళ్ల నిల్వ

ఖరీఫ్‌లో పత్తి, రబీలో శనగకు ప్రత్యామ్నాయంగా పొగాకు సాగు చేస్తే ఈ పంట కూడా రైతులను నట్టేట ముంచింది. జిల్లాలో 19,685 ఎకరాల్లో రైతులు పొగాకు సాగు చేశారు. ఖరీఫ్‌లో 4,095, రబీలో 15,590 ఎకరాల్లో పొగాకు సాగైంది. 2023 ఖరీఫ్, రబీలో పొగాకు సాగు విస్తృతంగా చేశారు. అయితే ధర కూడా ఆశాజనకంగా ఉండటంతో గత ఖరీఫ్, రబీల్లో పొగాకు సాగుకు రైతులు మొగ్గు చూపారు. పొగాకు దిగుబడులు బాగున్నా ధర పతనం అవడంతో తీవ్రంగా రైతులు నష్టపోతున్నారు. ముఖ్యంగా నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు జరగకపోతుండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లు కూడా అంతంతమాత్రంగానే జరగుతున్నాయి. కంపెనీలు పొగాకు కొనుగోలు చేయకుండా రైతులను నష్టపరుస్తున్నాయి. జిల్లాలో నల్లబర్లీ పొగాకు 4,840 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ నిర్ధారించింది. ఈ రకం పొగాకు నిల్వలు 52 వేల క్వింటాళ్లు ఉన్నట్లు అంచానా. 1,421 మంది రైతుల అన్‌లైన్‌లో నల్ల బర్లీ సాగు నమోదు చేసుకున్నారు.

ఉద్యమబాటలో..రైతులు

అయినా సదరు సంస్థలు పొగాకు కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. తెల్ల బర్లీ క్వింటా రూ.12 వేల వరకు కోనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే కొనుగోళ్ల నామమాత్రం కూడా జరగడం లేదు. నల్లబర్లీ అసలు కొనుగోళ్ల జరగకపోవడంతో రైతులు ఉద్యమ బాట పట్టారు. చిలకలూరిపేటలోని ఐటీసీ సంస్థ వద్ద నిరసన దీక్షలకు రైతు సంఘాల సమన్వయ సమితి నేతృత్వంలో పొగాకు రైతులు సమాయత్తమయ్యారు. రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు. చివరి ఆకు వరకు పొగాకు కొనుగోలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చేసిన ప్రకటన ఇంకా కార్యరూపం దాల్చకపోవడంతోనే రైతులు ఉద్యమానికి సిద్ధమయ్యారు.

డిమాండ్లు ఇలా..

- రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రి సమక్షంలో కంపెనీలు అంగీకరించిన విధంగా బర్లీ పొగాకు వెంటనే కొనుగోలు చేయాలి.
- గతేడాది కొనుగోలు చేసిన విధంగా క్వింటా రూ.15 వేలకు తక్కువ కాకుండా బర్లీ పొగాకును కంపెనీలు కొనుగోలు చేయాలి.
- కంపెనీలు కొనుగోలుకు ముందుకు రాకపోతే ప్రభుత్వ సంస్థ మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కోనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.
- బర్లీ పొగాకును పొగాకు బోర్డు పరిధిలోకి చేర్చాలి.

కూటమిలోకి.. కోవర్టులు





- మాచర్ల ఉదంతంతో బట్టబయలు
- పలు నియోజకవర్గాల్లో అదే పరిస్థితి
- నాడు వైసీపీలో ఉండి అరాచకాలు
- రక్షణ కోసం నేడు కూటమి పార్టీల్లోకి చొరబాటు

పల్నాడు ఎస్పీ తీరుపై టీడీపీ ఎమ్మెల్యేల ఆగ్రహం

తలలు పట్టుకుంటున్న టీడీపీ శ్రేణులు

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ అధికారంలోకి వచ్చిందన్న ఆనందం చాలా వరకూ పార్టీ శ్రేణుల్లో కనిపించడం లేదు. కూటమి పార్టీలలో వైసీపీ కోవర్టుల సంఖ్య ఎక్కువ ఉండడమే అందుకు కారణంగా తెలుస్తోంది. ఈ కోవర్టుల వ్యవహారం పార్టీకి అంకితమై పనిచేసిన కార్యకర్తలను అభద్రతా భావానికి గురిచేస్తోంది. అధికారంలో ఉన్న టీడీపీని బలహీన పరిచేందుకు వైసీపీ ఆడుతున్న కొత్త నాటకం ప్రస్ఫుటంగా కనిపిస్తున్నప్పటికీ ఏమి చేయలేని దుస్థితి ఉమ్మడి గుంటూరు జిల్లాలోని మెజారిటీ నియోజకవర్గాల్లో కనిపిస్తుంది. మాచర్ల నియోజకవర్గంలో తాజాగా జరిగిన హత్యలు.. ఆ తరువాత వెలుగులోకి వచ్చిన ఇద్దరూ ఒక పార్టీ వాళ్లే అన్న ప్రచారం కలవరాన్ని పుట్టిస్తున్నది. వాస్తవానికి హత్యకు గురయినవారు ఎప్పటి నుంచో తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. హత్యకు పాల్పడిన వారు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి అనుచరులుగా ముద్ర పడిన వాళ్లే. వ్యూహాత్మకంగా వాళ్లను టీడీపీలోకి పంపి హత్యలకు ఒడిగట్టినట్లు తెలుస్తోంది. టీడీపీ బలంగా ఉన్న ప్రతి గ్రామంలోనూ ఇదే రీతిలో వైసీపీ సానుభూతి పరులను పార్టీ మారినట్లు నాటకం ఆడించి, బలహీన పర్చే కుట్రలకు తెరలేచినట్లు తెలుస్తోంది. ఒక వేళ నేరుగా టీడీపీలో చేరే అవకాశం లేకపోతే కూటమి ప్రభుత్వంలో భాగస్వాములైన జనసేన, బీజేపీల్లోకి వైసీపీ కీలక నేతలు చేరి పోతున్నారు. ఇటువంటి చేరికలవల్ల టీడీపీకి సంస్థాగతంగా కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ఫ్యాక్షన్ నేపథ్యం ఉన్న పల్నాడులో కొత్త చేరికలు వల్ల టీడీపీకి పెను ప్రమాదం జరుగుతున్నట్లు తెలుస్తోంది.

అప్పుడూ వాళ్లే.. ఇప్పుడూ వాళ్లే..

గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి గుంటూరులో కొందరు నేతలు భయంకరమైన అవినీతి, అక్రమాలకు పాల్పడినవారే. అదేమని ప్రశ్నించిన టీడీపీ నేతలను చాలా ఇబ్బందులకు గురిచేశారు. ఇప్పుడు అదే నేతలు కూటమి ప్రభుత్వంలోని పార్టీలలో చేరటం టీడీపీ శ్రేణులను కలవరపరుస్తోంది. అప్పట్లో భయంకరంగా దాడులు చేసి అక్రమంగా కేసులు బనాయించిన వారు ఇప్పుడు ఏమి తెలియనట్లుగా 'సేఫ్ జోన్'లో ఉండటం ఇబ్బందులు పడిన కార్యకర్తలను మానసిక వ్యధకు గురిచేస్తోంది. ఉదాహరణకు పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారు రోశయ్య గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేయని దుర్మార్గం లేదు. ప్రభుత్వాధికారాన్ని అడ్డం పెట్టుకొని మట్టిని ఇష్టానుసారంగా తవ్వి కోట్లాది రూపాయలు సంపాదించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కాగా ఎన్నికల సమయంలో అన్ని ఆరోపణలు ఉన్న ఆయనకు అసలు టిక్కెట్ ఇవ్వరని చాలామంది భావించారు. వైసీపీ అధినాయకత్వం అవేవీ పట్టించుకోకుండా ఎంపీ సీటును కట్టబెట్టింది. ఎన్నికల్లో రోశయ్య ఘోరంగా ఓడిపోయారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన మీద విచారణ జరుగుతుందని అందరూ అనుకున్నారు. ఆలోపే కిలారు రోశయ్య కూటమి ప్రభుత్వంలోని భాగస్వామి అయిన జనసేనలో చేరారు. ఇప్పుడు అన్ని కేసులలో తప్పించుకొని దర్జాగా తిరుగుతున్నారు. తాజాగా జరిగిన మినీ మహానాడులో కూడా పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర అదే అంశంపై ఆందోళన వ్యక్తంచేశారు. వాస్తవానికి కూటమి పార్టీలలో ఎవరినైనా చేర్చు కొనే విషయంలో మిగిలిన పార్టీల అభిప్రాయంతో పనిలేకుండానే జరుగుతుండటం ఇబ్బందికరంగా మారింది.

పల్నాడు ఎస్పీ తీరుపై విమర్శలు

పల్నాడు జిల్లాలోని ఎస్పీ తీరు చూస్తుంటే అధికారంలో ఏ పార్టీ ఉందో అర్థం కాకుండా ఉంది. ఎస్పీ పూర్తిగా వైసీపీకి కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ వాళ్లకు ఏదైనా జరిగిందంటే తీవ్రంగా స్పందిస్తున్న ఎస్పీ, టీడీపీ వాళ్ళ విషయంలో మాత్రం పట్టీ పట్టనట్లు ఉంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైగా జంట హత్యలు జరిగిన వెంటనే టీడీపీలో అంతర్గత విభేదాలవల్లే హత్యలు అని పలనాడు ఎస్పీ ప్రకటించడం కూడా వివాదాస్పదమైంది. ఆ తరువాత జరిపిన దర్యాప్తులో పిన్నెల్లి సోదరుల పాత్ర కూడా ఉందని నిర్ధారణ కావటం వారిపై కూడా కేసు నమోదు అయింది. దీంతో ఎస్పీ తొలుత చేసిన ప్రకటన వైసీపీ నేతలకు అస్త్రంగా మారింది. ఈ నేపథ్యంలో ఎస్పీ పై పలువురు సీనియర్ ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు.

రాజకీయ.. రక్త చరిత్ర
గుండ్లపాడు ఫ్యాక్షన్‌లో 20 మంది మృతి
ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు
ఏ ఒక్క ఘటనలోనూ శిక్ష పడని వైనం
ఫ్యాక్షన్ ముఠాలకు రాజకీయ అండదండలు
8

నేటి నుంచి వర్ష సూచన

- 28, 29 తేదీల్లో భారీగా
- వాతావరణ శాఖ వెల్లడి

నరసరావుపేట, మే 26 (ఆంధ్రజ్యోతి) : రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించాయి. జిల్లాకు కూడా రుతుపవనాలు విస్తరించనున్నాయి. నేటి నుంచి 30 వరకు తేలికపాటి నుంచి మోస్తరు.. అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వాతా వరణ శాఖ సోమవారం వెల్లడించింది. 28, 29 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తా యి. 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని పేర్కొంది. సాధారణ వర్షాలు 2.5 మీమీ నుంచి 15.5 మి.మీ.. మోస్తరు వర్షాలు 15.6 మి.మీ నుంచి 64.4 మి.మీ.. భారీ వర్షాలు 64.5 మీమీ నుంచి 115.5 మి.మీ వరకు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే సమయంలో చెట్లు, టవర్స్, పోల్స్, పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని, సురక్షితమైన భవనాల్లో ఉండాలని సూచించింది. రుతుపవ నాల ప్రభావంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. సోమవారం జిల్లాలో 28 నుంచి 32 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత మోదైంది. వాతావరణం చల్లబడటంతో జిల్లా వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

మహా ఉత్సాహం

- మహానాడు వెళ్లేందుకు టీడీపీ శ్రేణులు సన్నద్ధం
- భారీగా తరలాలని ఎమ్మెల్యేల పిలుపు
- చీఫ్‌విప్ జీవీకి పులివెందుల జనసమీకరణ బాధ్యతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) తెలుగు తమ్ముళ్లలో మహా ఉత్సాహం నెలకొంది. కడపలో 27,28,29 తేదీల్లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడుకు తరలివెళ్లేం దుకు తెలుగుదేశం శ్రేణులు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన అనంతరం టీడీపీ తొలిసారిగా కడపలో నిర్వహిస్తున్న మహానాడు పండుగకు భారీగా జిల్లా నుంచి తరలివెళ్లాలని ఎమ్మెల్యేలు పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి మహానాడును విజయవంతం చేద్దామని పార్టీ శ్రేణులను నేతలు సమాయత్తం చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి వెయ్యి నుంచి రెండు వేల మంది మహానాడుకు తరలివెళ్లనున్నారు.


గురజాల నియోజకవర్గం నుంచి కడప మహానాడుకు తరలివెళ్తున్న టీడీపీ శ్రేణులు

ఇందుకు వాహనాలు సమకూర్చుకుంటున్నారు. 29న జరిగే భారీ బహిరంగ సభకు ఎక్కువగా వెళ్ళేందుకు ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే జిల్లా నుంచి జన సమీకరణ చేయడంలేదు. స్వచ్ఛందంగానే తరలివెళ్లనున్నారు. మహానాడు కమిటీల్లో జిల్లా నేతలు కీలక బాధ్యలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక వనరుల కమిటీలో టీడీపీ పార్లమెంటరీ నేత, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సభ్యునిగా ఉన్నారు. జనసమీకరణ కమిటీలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, రక్తదాన, వైద్య శిబిరం కమిటీలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సభ్యులుగా ఉన్నారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజవర్గంలో జన సమీకరణ బాధ్యలను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులకు అధిష్టానం అప్పగించింది. ఆయన పులివెందులలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు రాజాంపేటలో పర్యటిస్తున్నారు. అక్కడి నేతలు, కార్యకర్తలతో పుల్లారావు మమేకం అవుతూ మహానాడుకు భారీగా తరలిరావాలని పిలుపు నిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ రాయచోటి నియోజకవర్గంలో జనసమీకరణపై అక్కడి నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. మదనపల్లిలో జనసమీకరణపై ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అక్కడి పార్టీ నేతలతో సమీక్షించారు.

రికవరీ మేనేజర్ ఆత్మహత్య

● రూ.40 లక్షలు కంపెనీ సొమ్ము వాడుకున్నాడని ఆరోపణ


జక్కా శ్రీరామ్‌కుమార్ మృతదేహం

నాదెండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరం గ్రామానికి చెందిన ఫినాన్స్ కంపెనీ రికవరీ మేనేజర్ జక్కా శ్రీరామ్ కుమార్(32) సోమవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన గడిచిన రెండేళ్లుగా చిలకలూరిపేట పట్టణంలోని శ్రీరామ్ ఫినాన్స్ కంపెనీలో రికవరీ మేనేజరుగా పని చేస్తున్నాడు. అతను సుమారు రూ.40 లక్షలు కంపెనీ సొమ్ము వాడుకున్నాడన్నది యాజమాన్యం ఆరోపణ. కొంత కాలంగా సొమ్మును చెల్లించాలని యాజమాన్యం అతనిపై ఒత్తిడి చేస్తోంది. ఈ క్రమంలో గ్రామంలోని జక్కావారి వీధిలో నివాసం ఉంటున్న మేనేజర్ ఎవ్వరూ లేని సమయంలో తన ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య సింధూర, కుమార్తె రిషిక, కుమారుడు అభయ బాలాజీ ఉన్నారు. భార్య సింధూర గణపవరం గ్రామ పంచాయతీలో బిల్లు కలెక్టర్‌గా పని చేస్తున్నారు. తన భర్త శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ఒత్తిడి, బెదిరింపుతోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఎలాంటి సొమ్ము వాడు కోలేదని నాదెండ్ల పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్ఐ పుల్లారావు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.



నడక యాతన

గుంటూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు అత్యవసర పరిస్థితిలో వచ్చే వారు నడ(ర)క యాతన పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రికి వచ్చిన వారిని లోపలికి తీసుకువెళ్లేందుకు తగినంత మంది సహాయకులు ఇక్కడ లేరు. ఉన్న స్ట్రెక్చర్లు.. వీల్ చైర్స్ అందుబాటులో లేవు. ఫలితంగా రోగిని వెంట వచ్చిన సహాయకులు.. చేతులతో ఎత్తుకొని కష్టం మీద మోసుకొని పోవాల్సిన దుస్థితి నెలకొంది. - (ఆంధ్రజ్యోతి, గుంటూరు)

మహానాడుకు దేగల రూ.10లక్షల విరాళం


దేగల ప్రభాకర్

గుంటూరు, మే 26(ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ రూ.10 లక్షల విరాళమిచ్చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ పెద్దలకు నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దేగల ప్రభాకర్ మాట్లాడుతూ కడప గడ్డపై మొదటి సారిగా జరుగుతున్న టీడీపీ మహానాడును చరిత్రలో నిలిచిపోయేలావిజయ వంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కడప వచ్చే ప్రజలకు వసతి, భోజన ఏర్పాటులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు జరిగినట్లు దేగల తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్తూ.. మృత్యు ఒడిలోకి..

● ఆటో బోల్తా.. మహిళ మృతి


జీవరత్నం మృతదేహం

మాచర్లటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనానికి వెళ్తూ ప్రమాదవశాత్తూ మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం రాత్రి మాచర్ల పట్టణంలో జరిగింది. పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన చెంబేటి జీవరత్నం(33) తన బంధువులతో కలిసి విజయపురి సౌత్‌లోని సాగరమాత ఆలయంలో నిద్ర చేసేందుకు రైలులో రాత్రి మాచర్లకు చేరుకున్నారు. రైల్వేస్టేషన్ వద్ద సుమారు పది మంది తోటి ప్రయాణికులతో కలిసి ఆటో ఎక్కింది. రాత్రి 11 గంటలకు విజయపురిసౌత్ వెళ్తుండగా పట్టణ శివారులోని ఆర్టీసీ గ్యారేజీ వద్ద వీధి కుక్కలు హఠాత్తుగా అడ్డురావడంతో వాటిని తప్పించబోయి డ్రైవర్ ఆటో సడన్ బ్రేకు వేశాడు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో జీవరత్నం తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన 9 మందికి స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. జీవరత్నం మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

షూటర్ ముఖేష్‌కు కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన ముఖేష్ నేలవల్లి

తాడేపల్లి (వడ్డేశ్వరం), మే 26 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలో బీటెక్ సీఎస్ఐటీ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థి ముఖేష్ నేలవల్లి. ఐఎస్ఎస్ఎఫ్ రైఫిల్ షూటింగ్ ప్రపంచ జూనియర్స్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం సాధించినట్లు వర్సిటీ క్రీడల డైరెక్టర్ డాక్టర్ కె.హరికిషోర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో 22 పాయింట్లతో ముఖేష్ పతకం సాధించినట్లు వెల్లడించారు. ఈ నెల 24 నుండి జర్మనీలోని సుహ్ షూటింగ్ రేంజ్‌లో ఈ పోటీలు జరిగాయి. ఫ్రాన్స్‌కు చెందిన థామస్ క్లైమెంట్ స్వర్ణం, పోలెండ్‌కు చెందిన విక్టర్ లూకాస్ రజత సాధించారని పేర్కొన్నారు. ముఖేష్‌ను కేఎల్‌యూ యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.

ఉద్యోగాల పేరిట ఘరానా మోసం!

● విదేశాలకు పంపిస్తామని రూ.5 కోట్లు వసూలు

● గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేసిన విద్యార్థులు

పిడుగురాళ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పిడుగురాళ్ల పట్టణంలోని లలిత ఇన్‌స్టిట్యూట్ యాజమాన్యం మోసం చేసిందని పలువురు విద్యార్థులు సోమవారం నరసరావుపేటలో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. లలిత టూరిజం అండ్ హోటల్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ పేరుతో భారీగా ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుండి భారీగా నగదు వసూలు చేశారని విద్యార్థులు హనుమంత మూర్తి, యశ్వంత్, జక్కం శాంతి ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. 2022-24 మధ్య కాలంలో యూరప్‌కు పంపిస్తామని ఒక్కో విద్యార్థి నుండి రూ.30లక్షల నుండి రూ.40 లక్షల వరకు నగదు వసూలు చేశారని పేర్కొన్నారు. ఉద్యోగం వచ్చిందంటూ కొందరిని మోసం చేసి ఊటీ ట్రిప్‌కు సంస్థ యాజమాన్యం పంపిస్తున్నట్లు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. సంస్థ యజమాని పసుమర్తి కిషోర్, అతని బంధువులు, మేనేజర్ కత్తి సునీత తమవద్ద సుమారు రూ.5 కోట్లకు పైగా వసూలు చేశారని ఎస్పీకి వివరించారు. డబ్బు చెల్లించాలని అడిగితే తమపైనే ఎస్సీ ఎట్రాసిటీ కేసు పెడతామని బెదిరిస్తున్నారని తెలిపారు.

వెబ్‌సైట్‌లో హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా

● నేడు సర్టిఫికెట్ల పరిశీలనకు రావాలి:డీఈఓ

గుంటూరు (విద్య) మే 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సీనియార్టీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ సివి రేణుక సోమవారం ప్రకటనలో తెలిపారు. జాబితాలోని ఉపాధ్యాయులు మంగళవారం గుంటూరులోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు. విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలు రెండు సెట్లు, సేవా పుస్తకం తీసుకురావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం www.deogngblogspot.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని పేర్కొన్నారు.

పీఎస్ హెచ్‌ఎంల సీనియార్టీ జాబితా...

ఉమ్మడి జిల్లాలో పీఎస్ హెచ్‌ఎం బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న వారి జాబితాను(www.deogngblogspot.in) వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు. అభ్యంతరాలు ఉంటే మంగళవారం సాయంత్రంలోగా తెలియజేయాలని పేర్కొన్నారు.

నేడు స్కూల్ అసిస్టెంట్స్ సర్టిఫికెట్ల పరిశీలన

గుంటూరు(విద్య),మే 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు జోన్ 3 పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్స్, తత్సామాన క్యాడర్‌లో పని చేస్తున్న వారికి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల ఉద్యోగోన్నతులు కల్పించేందుకు మంగళవారం సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నట్లు ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి సోమవారం తెలిపారు. గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు జోన్ 3 పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ ఉపాధ్యాయులు హాజరుకావాలని తెలిపారు. ఇందులో సీరియల్ నంబరు 1 నుంచి 75 వరకు పేర్లు ఉన్నవారు తప్పనిసరిగా హాజరుకావాలని పేర్కొన్నారు.

చిత్తడి నేల అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యుల నియామకం

అమరావతి, మే26(ఆంధ్రజ్యోతి): స్టేట్ వెట్‌ల్యాండ్(చిత్తడి నేలల) అథారిటీకి నలుగురు అధికారేతర సభ్యులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్‌కు చెందిన చిత్తడి నేలల జీవావరణ శాస్త్ర నిపుణుడు ఆర్ రామ సుబ్రహ్మణియన్, ప్రపంచవ్యాప్త ప్రకృతి నిధి(డబ్ల్యూడబ్ల్యూఎఫ్-ఇండియా) రాష్ట్ర సంచాలకుడు ఫరీదా తంపాల్, కోయంబత్తూర్‌లోని తడిభూముల జీవావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గోల్డిన్ క్వాడ్రోస్, డెహ్రాడూన్‌లోని అంతరించిపోతున్న జాతుల నిర్వహణ సంస్థ శాస్త్రవేత్త ఆర్ సురేష్‌కుమార్ సభ్యులుగా నియమితులయ్యారు. కాగా రాష్ట్రంలో చిత్తడి నేలల పరిరక్షణ కోసం స్టీరింగ్ కమిటీ స్థానంలో ఈ అథారిటీ ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పాటైంది. అధికారులతో పాటు మూడేళ్ల పదవీ కాలానికి అధికారేతర సభ్యులను ప్రభుత్వం నామినేట్ చేసింది.

బకాయిలు చెల్లించకపోతే సంక్షోభంలోకి విద్యా సంస్థలు

● ప్రైవేటు పాఠశాలల సంఘాల సమాఖ్య

అమరావతి, మే 26 (ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టం కింద చేరిన విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సమాఖ్య ప్రభుత్వాన్ని కోరింది. లేనిపక్షంలో విద్యా సంస్థలు సంక్షోభంలో పడతాయని సోమవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేసింది. విద్యా హక్కు చట్టం కింద ప్రభుత్వం ప్రతిపాదించిన ఫీజులపై అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిపింది. ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందికరంగా ఫీజులు నిర్ణయించడం సరికాదని పేర్కొంది. ఫీజులపై అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ప్రతిపాదిత ఫీజులను తాము ఆమోదించలేదని తెలిపింది.

ముందస్తు భద్రత డ్రైవ్‌లు నిర్వహించాలి

● దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



దక్షిణ మధ్య రైల్వే జీఎం వీడియో కాన్ఫరెన్స్‌కి హాజరైన డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): రాబోయే వర్షాకాలం దృష్ట్యా రైల్వే ట్రాక్‌ల వెంట ముందస్తు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ ఆదేశించారు. సోమవారం ఆయన సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుంటూరు డీఆర్‌ఎం సుధేష్ణ సేన్‌తో సమీక్షించారు. తొలుత డివిజన్ వ్యాప్తంగా వర్షాకాలం సంసిద్ధత గురించి అడిగి తెలుసుకొన్నారు. అనంతరం జీఎం మాట్లాడుతూ అనివార్య పరిస్థితులను నివారించడానికి ట్రాక్‌లు, వంతెనలు, భారీ వర్షపాతం ఉన్న ప్రదేశాలు, అన్ని కీలక విభాగాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని అధికారులను ఆదేశించారు. సిగ్నలింగ్ వ్యవస్థ మొదలైన వాటి సరైన పనితీరును నిర్ధారించాలని ఆయన డీఆర్‌ఎంకు సూచించారు. రైలు కార్యకలాపాలలో కఠినమైన సమన్వయం, రైళ్లను నడుపుతున్నప్పుడు అనుసరించాల్సిన అన్ని భద్రత చర్యలను నొక్కి చెప్పారు. సంఘ విద్రోహ శక్తుల కార్యకలాపాల నుంచి ట్రాక్ భద్రతను పెంపొందించేందుకు అదనపు ఆర్‌పీఎఫ్ బలగాలను, పెట్రోలింగ్ సిబ్బందిని నియమిం చాలన్నారు. త ద్వారా ట్రాక్ పెట్రోలింగ్ బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

పర్యాటకులపై విచక్షణ రహితంగా దాడి

● కొండవీడు కోటలో కాంట్రాక్టర్ వర్గీయుల దారుణం
● కారు అద్దాలు ధ్వంసం
● తల్లి ముందే కూతురుపై దాడి, గాయాలు
● కాళ్లు పట్టుకుని ప్రాధేయపడినా వదలని వైనం
● 112కు ఫోన్ చేసినా, యడ్లపాడు పోలీసులకు చెప్పినా కానరాని స్పందన

గుంటూరు, మే 26(ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన కొండవీడు కోటలో కాంట్రాక్టర్ వర్గీయులు పర్యాటకులపై విచక్షణ రహితంగాగా దాడి చేశారు. తల్లి కళ్ల ముందే 17 ఏళ్ల కూతురిని జుట్టు పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లి అత్యంత దారుణంగా వ్యవహరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాల్లోకెళ్తే.. నగరంలోని మిర్చియార్డు రోడ్డులో గల సాయినగర్ లక్ష్మీప్రియ అనే మహిళ నివాసం ఉంటోంది. తన భర్త, కూతురు, మేనల్లుడితో కలిసి కారులో సోమవారం సాయంత్రం కొండవీడు కోటకు వెళ్లారు. అక్కడ గేటు ఎంట్రన్స్ లోనే తమ నుంచి డబ్బులు కట్టించుకున్నారని బాధితురాలు తెలిపింది. కొండపైకి వెళ్లిన తర్వాత అక్కడ సెల్ఫీ తీసుకుంటుండగా.. అక్కడ పని చేసే ఓ యువకుడు టికెట్ తీసుకోవాలని అడిగాడు. ఈ విషయమై వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం లక్ష్మీప్రియ కిందకి వస్తుండగా.. కింద టోల్గేట్ వద్ద సుమారు 25 మంది వారిపై దాడికి పాల్పడ్డారు. అక్కడి నుంచి తప్పించుకుని వస్తుండగా.. కొత్తపాలెం గ్రామంలో రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి తమ కారును అటకాయించి తమపై దాడి చేశారని లక్ష్మీప్రియ తెలిపింది. కారు అద్దాలు ధ్వంసం చేశారని, కాళ్లు పట్టుకొని ప్రాధేయపడిన వదిలిపెట్టకుండా దారుణంగా కొట్టారని పేర్కొంది. తన భర్త ముని కోటేశ్వరరావు రెండు చేతులు వెనక్కు విడిచి పట్టుకుని తమ కుమార్తెపై దాడి చేశారని, తనను తీవ్రంగా కొట్టారని.. వారి దాడి నుంచి ప్రాణ రక్షణ కోసం కారులో దాక్కుని డోర్లు బ్లాక్ చేసుకున్నప్పటికీ వదిలిపెట్టలేదన్నారు. దీనిపై 112కు ఫోన్ చేయగా సకాలంలో పోలీసులు స్పందించలేదన్నారు. చివరకు ఎక్కడైనా పోలీసులకు ఫిర్యాదు చేస్తే చంపేస్తామని బెదిరించారన్నారు. దీనిపై యడ్లపాడు సీఐకు ఫోన్ చేస్తే ఆయన నుంచి కూడా స్పందన రాలేదన్నారు. అదేమంటే తాము ప్రభుత్వానికి రూ.30 లక్షలు చెల్లించి కాంట్రాక్టు దక్కించుకున్నామని.. అక్కడ పనిచేసే సిబ్బందికి యూనిఫాం, ఐడెంటిటీ కార్డు లేకపోవడంతో ప్రశ్నించినందుకు దాడి తీసి కొట్టారన్నారు. దీనిపైన తాను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కార్యాలయానికి ఫోన్ చేసి ఫిర్యాదు చేశామన్నారు. యడ్లపాడు పోలీస్ స్టేషన్ లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము జనసేన పార్టీ వారమని, తమను ఏమి చేయలేరంటూ గ్రామస్తులందరూ భయభ్రాంతులకు గురి చేసి కొట్టారన్నారు. తాముకూడా జనసేన పార్టీనే అని చెప్పినప్పటికీ వినిపించుకోలేదని వాపోయారు. మంగళవారం మంగళగిరిలోని జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎక్కడ కూడా జనసేన కార్యకర్తలు భవిష్యత్తులో ఇటువంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడకుండా ఉండేలా పవన్ కల్యాణ్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారును ఢీకొన్న లారీ..

● నలుగురికి స్వల్పగాయాలు ● కలికివాయి ఫ్లైఓవర్‌పై ప్రమాదం

సింగరాయకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై ముందువెళ్తున్న కారును వెనుకవైపు వస్తున్న లారీ ఢీకొనడంతో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం కలికివాయి ఫ్లైఓవర్‌పై సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. చిలకలూరిపేటకు చెందిన నిమ్మల చంద్రశేఖరరావు-రాజేశ్వరి, కాకుమాని అంజన్‌రావు-చిలకమ్మ దంపతులు తిరుమలకు వెళ్లి దైవదర్శనం చేసుకున్నారు. తిరిగి స్వగ్రామానికి బయల్దేరారు. కారు కలికివాయి ఫ్లైఓవర్ వద్దకు చేరుకునే సరికి వెనుక వైపు వస్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కారు బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే మొబైల్ పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కారులో ఉన్న వారిని బయటకు తీశారు. అనంతరం అక్కడికి చేరుకున్న ఎస్సై బి.మహేంద్ర హైవే అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేయించి క్షతగాత్రులను ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అనంతరం క్రేన్ సహాయంలో కారును పక్కను తొలగించారు. లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు.


రోడ్డుపై బోల్తా కొట్టిన కారు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

2న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

మాచర్లటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పురపాలక సంఘానికి పూర్తిస్థాయి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జూన్ 2వ తేదీన నిర్వహించనున్నట్లు పురపాలక సంఘ కమిషనర్ దూళిపాళ్ల వేణుబాబు తెలిపారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి చైర్మన్‌గా షేక్ మదార్‌సాహెబ్ కొనసాగుతున్నారు. వైస్ చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో నూతన సభ్యుడి ఎన్నిక జరగనుంది.

తిరుపతికి బస్సు సర్వీసు ప్రారంభం

సత్తెనపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి నుంచి తిరుపతికి హైటెక్ బస్సు సర్వీసును ప్రారంభించినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ సోమవారం తెలిపారు. సత్తెనపల్లి ప్రాంతంలోని వారు తిరుపతి వెళ్లే బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

షేక్ బాజీకి అభినందనలు



బాజీని అభినందిస్తున్న యరపతినేని నిఖిల్

పిడుగురాళ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప సమీపంలో జరుగుతున్న మహానాడుకు గురజాల నియోజకవర్గం పిడుగురాళ్ల నుంచి సైకిల్‌యాత్రగా వెళ్లిన షేక్ బాజీని సోమవారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్ అభినందించారు. మహానాడు ప్రాంగణంలో నిఖిల్‌ను బాజీ కలిసి వారం రోజులపాటు కొనసాగించిన సైకిల్ యాత్ర వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బాజీని యువనాయకుడు నిఖిల్ అభినందించారు.

జూదరుల అరెస్టు

మాచర్లటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్ ఫైర్‌స్టేషన్ సమీపంలో పేకాట స్థావరంపై పట్టణ ఎస్ఐ సంధ్యారాణి దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2900 నగదును స్వాధీనం చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ సంధ్యారాణి తెలిపారు.

మట్టి అక్రమంగా తరలించిన వ్యక్తిపై కేసు

కారంపూడి, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్ల గ్రామానికి చెందిన కోట సాగర్‌బాబు నాలుగురోజుల క్రితం 200 మట్టి ట్రిప్పులను అక్రమంగా మట్టి తరలింపు చేశారని అదే గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు ఎస్ఐ వాసు సోమవారం సాయంత్రం కేసు నమోదు చేశారు. అక్రమ మట్టి తరలింపునకు ఎవరైనా పాల్పడితే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ వాసు అన్నారు. ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యక్తి పై దాడి.. కేసు నమోదు

సత్తెనపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో వ్యక్తిపై వరుసకు సోదరుడు, అతని బంధువులు దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం సాయంత్రం పట్టణంలోని నందిగామ డొంక రోడ్డు ప్రాంతంలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పల్లపు రమేష్ అనే యువకుడు కుటుంబ తగాదాల నేపథ్యంలో వరుసకు సోదరుడయ్యే సాంబపై ఉదయం దాడి చేశారు. సాయంత్రం సాంబ అతడి బంధువులు పల్లపు రమేష్ పై దాడి చేశారు. బీరు బాటిల్‌తో రమేష్ తలపై కొట్టి గాయపరచటంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా వైద్యశాలకు తరలించారు. రమేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద మృతి

క్రోసూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పర్ల గ్రామ శివారు ఊటుకూరు వెళ్లే వైపు వ్యక్తి మృతదేహం ఉండటాన్ని సోమవారం ఉదయం గ్రామస్థులు గుర్తించారు. అనంతవరం గ్రామానికి చెందిన కుంభా సాంబశివరావు(37)గా పోలీసులు గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం సాంబశివరావుది పెదకూరపాడు మండలం 75తాళ్ళూరు కాగా కొంతకాలంగా క్రోసూరు మండలం అనంతవరంలో సోదరి ఇంటి వద్ద ఉంటున్నాడన్నారు. ఆదివారం సాయంత్రం 75 తాళ్ళూరు వెళ్లి వస్తానని బైక్‌పై వెళ్లిన సాంబశివరావు ఆచూకీ కుటుంబసభ్యులకు తెలియలేదన్నారు. తరువాత మృతదేహాన్ని గుర్తించిన విప్పర్ల గ్రామస్థుల సమాచారం మేరకు ఘటనా స్థలాన్ని సందర్శించినట్టు, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ముక్కులో నుంచి రక్తం మాత్రం వచ్చిన ఆనవాళ్ళు ఉన్నాయన్నారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్టు తెలిపారు. క్రోసూరు ఎస్ఐ పీ రవిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలియజేశారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మే 26 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 512.60 అడుగులు ఉంది. ఇది 136.12 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6498 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

పులిచింతల..

అచ్చంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 22.01 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈఈ రాజు తెలిపారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదలవుతుందన్నారు.

కండ్లకుంటలో నిలిచిన భవన నిర్మాణాలు

● సొసైటీ భవనంలో నడుస్తున్న సచివాలయం

నకరికల్లు, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండ్లకుంటలో సచివాలయ భవనాల నిర్మాణాలు నిలిచిపోయాయి. గ్రామ సచివాలయ భవనం, రైతు సేవాకేంద్రం, హెల్త్ క్లినిక్ గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం గడిచినా ఈ భవనాల నిర్మాణాలు ముందుకు సాగటం లేదు. సొసైటీ భవనంలో ప్రస్తుతం సచివాలయ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు, సచివాలయ ఉద్యోగులకు ఇరుకుగా ఉన్న ఈ భవనంలో సచివాలయ విధులు నిర్వహించటం ఇబ్బందికరంగా మారింది. సచివాలయ భవనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి గ్రామ సచివాలయ భవనాన్ని, రైతు సేవా కేంద్రాన్ని, హెల్త్ క్లినిక్‌ను నిర్మాణాలు పూర్తి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



నిలిచి పోయిన హెల్త్ క్లినిక్



నిర్మాణంలో రైతు సేవా కేంద్రం



సొసైటీ భవనంలో ప్రస్తుతం నడుస్తున్న సచివాలయం

హత్యా రాజకీయాలు వద్దు.. అభివృద్ధి ముద్దు

● టీడీపీ సీనియర్ నేత యాగంటి



సమావేశంలో మాట్లాడుతున్న యాగంటి

మాచర్లటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో ఇకనైనా హత్యా రాజకీయాలకు స్వస్తి పలికి అభివృద్ధి వైపు అడుగులు వేసేందుకు అందరూ సహకరించాలని మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు కోరారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. హత్యా రాజకీయాల వల్ల అభివృద్ధి కుంటుపడటంతోపాటు అనేక కుటుంబాలు రోడ్డున పడతాయన్న విషయం గుర్తించాలన్నారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో జరిగిన జంట హత్యలు బాధాకరమన్నారు. క్షణికావేశంలో చేస్తున్న హత్యలు ఎన్నో కుటుంబాలను రోడ్డుపాలు చేస్తున్న విషయం ఇకనైనా తెలుసుకోవాలని హితవు పలికారు. నాయకుల మెప్పు కోసం ఒకరినొకరు హత్యలు చేసుకుంటూ పోతే నష్టపోయేది మీ కుటుంబాలేనని, ఏదైనా సమస్యలుంటే కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని అన్నారు. మాచర్ల ప్రాంతంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు ఈ హత్యాకాండ వల్ల కుంటుపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా మాచర్ల ప్రాంతంలోనే ఈ హత్యా రాజకీయాలు జరుగుతుండడం ఆందోళనకరమన్నారు. పల్లెల్లో ప్రశాంతత నెలకొనేలా కృషి చేయాలని యాగంటి అన్నారు.

మొక్కుబడిగా మండలపరిషత్ సర్వసభ్య సమావేశం



ప్రసంగిస్తున్న ఎంపీడీవో కె.సరోజనీదేవి

రెంటచింతల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మొక్కుబడిగా నిర్వహించారు. 3 నెలలకోసారి నిర్వహించాం అన్నట్లుగా ఎంపీటీసీలు రిజిస్టర్‌ల్లో సంతకాలు చేశారు. పూర్తి స్థాయిలో సభ్యులెవరూ హాజరుకాలేదు. 14 మంది ఎంపీటీసీలకు కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. ఈ ఎంపీటీసీలు ఎవరూ ప్రత్యక్ష ఎన్నికల్లో కష్టపడి గెలిచిన వారు కాదు.. అందరూ ప్రతిపక్ష వైసీపీకి చెందిన వారే. నాలుగేళ్ల నాడు టీడీపీ అభ్యర్థుల్ని నామినేషన్ వేయకుండా దాడులు చేశారు. బాధితుల్లో మల్లవరానికి చెందిన మైనార్టీ నేత ఒకరు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ మీకన్నా మేం తక్కువేం తినలేదనే భావంతో వ్యవహరించడానికి సిద్ధంగా ఉన్నారు.. ఎంపీడీవో సరోజనిదేవితో పాటు ఇతర అధికారులు ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శౌరెడ్డి, ముక్కంటేశ్వర రెడ్డి, దానియేల్, లావు రత్నాకర్, అచ్చమ్మ తదితర ఎంపీటీసీలు మాత్రమే పాల్గొన్నారు.

ముదిరాజుల శ్మశాన వాటిక సమస్య పరిష్కారం



నారాయపురంలో స్థలాన్ని సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

దాచేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): 30 సంవత్సరాలుగా శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ముదిరాజులు చేస్తున్న పోరాటం ఎట్టకేలకు సోమవారం నాటికి పరిష్కారమైంది. ముదిరాజులు మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం పిడుగురాళ్ళలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ప్రజాసమస్యల వేదికలో దాచేపల్లి నగర పంచాయతీకి చెందిన ముదిరాజులు తమకు ఎంతోకాలంగా ఇబ్బందిగా ఉన్న శ్మశాన వాటిక స్థలం పరిష్కారం చేయాలని కలెక్టర్ అరుణ్‌బాబుకు అందజేశారు. రెవెన్యూ శాఖకు చెందిన సర్వేయర్లు, వీఆర్‌ఏ, వీఆర్‌వోలు కలసి స్థలాన్ని సర్వే చేశారు. సర్వే నెంబరు 196/2/బీ2లో 48 సెంట్లను ముదిరాజులకు మంజూరు చేశారు. ఏళ్ళ తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించకపోవటంతో ఎమ్మెల్యే చొరవతో తమకు నేటికి న్యాయం జరిగిందని ముదిరాజులు కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ గ్రామ నాయకులు సొసైటీ నారాయణ, నర్రా పుల్లయ్య, కొరిమెళ్ళ బుల్లెబ్బాయి, ఐనాల శ్రీరాములు ఆధ్వర్యంలో సర్వే పూర్తి చేశారు. కార్యక్రమంలో ముదిరాజుల సంఘం అధ్యక్షుడు గుర్రం శ్రీనివాసరావు, రామకోటయ్య, కాశయ్య, గురవయ్య, హనుమయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

గోవుల అక్రమ రవాణాను, గోవధను అరికట్టండి

● విశ్వ హిందూ పరిషత్ సభ్యులు



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ గో ప్రముఖ్ సభ్యులు

క్రోసూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): క్రోసూరు ప్రాంతంలో ఆవుల అక్రమ రవాణా, వధ యథేచ్ఛగా జరుగుతున్నాయని, దీనిని అరికట్టాలని విశ్వహిందూ పరిషత్ గోరక్ష సభ్యులు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కొంత మంది ఆవులవారిపాలెం, దొడ్లేరు గ్రామాల పరిధిలో ఆవులను సేకరించి స్థానిక మార్కెట్ యార్డులోను, ప్రైవేట్ స్థలా ల్లోను అక్రమ నిల్వలు చేసి వాటిపై కే అనే గుర్తులు కాల్చి వేస్తున్నారన్నారు. వాటిని కేరళ, తెలంగాణా ప్రాంతాలకు కబేళాలకు తరలిస్తున్నారన్నారు. ఆవులను, పశువులను కబేళాలకు తరలించాలంటే అవి వ్యవసాయానికి పనికి రావని, పాడి పరిశ్రమకు ఉపయోగపడవని, ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని పశు వైద్యాధికారులు ధ్రువీకరించాల్సి ఉంటుందన్నారు. ఇటువంటివేమి లేకుండా అక్రమ మార్కులు చెలరేగి పోతూ వందల సంఖ్యలో ఆవులను, పశువులను లారీల్లోను, ఇతర వాహనాల్లోను ఇతర రాష్ట్రాలకు అక్రమ రవాణా చేస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు చూసి కూడా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. వినతిపత్రం సమర్పించిన వారిలో విశ్వ హిందూ పరిషత్ జిల్లా గోరక్ష ప్రముఖ్ తుమ్మా మల్లారెడ్డి, సభ్యులు కామేశ్వరాచారి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శుభ్రత మాటల్లోనే..



సచివాలయం వద్ద రోడ్డు పక్కన పడ వేసిన వ్యర్థాలు

బెల్లంకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛభారత్ అంటూ ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా మండలస్థాయి అధికారుల తీరు మాత్రం మారట్లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వాలు చెపుతున్నా స్థానిక అధికారులు ర్యాలీలు చేస్తూ ఉపన్యాసాలతో సరి పెట్టుకుంటున్నారు. బెల్లంకొండ సచివాలయం సమీపంలో రోడ్డు పక్కనే వ్యర్థాలు పేరుకుపోయి చెత్త రోడ్డు పక్కన పడవేస్తున్నా పట్టించుకొనే నాథుడే లేడు. అదేవిధంగా మాచాయపాలెం ఆర్అండ్ఆర్ సెంటర్ వద్ద గ్రామాల్లో సేకరించిన చెత్తను రహదారుల పక్కన వేసి నిప్పుపెడుతున్నారు. సమీపంలో సచివాలయం, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఉన్నప్పటికి పట్టించుకోవటంలేదని ఆరోపిస్తున్నారు. చికెన్ షాపు యజమానులు కోడి వ్యర్థాలను సచివాలయ సమీపంలో వేస్తున్నప్పటికీ పంచాయతీ, మండలస్థాయి అధికారులకు చీమ కుట్టినట్టుగా కూడా లేదని విమర్శలు వినవస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వ్యర్థాలు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

డీలర్ల అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా తొట్టెంపూడి

అచ్చంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడిగా పెదపాలెం గ్రామానికి చెందిన తొట్టెంపూడి శివకృష్ణ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. వైస్ ప్రెసిడెంట్‌గా అన్నవరపు శివశంకర్ ఎన్నిక కాగా మండల తహసీల్దార్ శ్రీనివాస్ ఎన్నికైన వారిని అభినందించారు.

దరువూరిపై ఆరోపణలు తగదు

సత్తెనపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): దరువూరి నాగేశ్వరరావుపై జనసేన నేత కొమ్మిశెట్టి సాంబశివరావు ఆరోపణలు చేయటం తగదని టీడీపీ నేతలు అన్నారు. టీడీపీ ప్రజావేదికలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ్మిశెట్టి సాంబశివరావు న్యాయవాదినంటూ చౌకబారు ఆరోపణలు చేయటం తగదన్నారు. ఆరోపణలు రుజువు చేయాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో మారెళ్ళ మల్లేశ్వరరావు, ఎస్కే మస్తాన్‌వలి, కోటేశ్వరరావు, పురుషోత్తం నాయక్, శంకర్‌నాయక్, మారెళ్ళ స్వామి, ఎస్కే షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సాంబశివరావుపై దాడికి ఖండన

సత్తెనపల్లి పట్టణానికి చెందిన న్యాయవాది కొమ్మిశెట్టి సాంబశివరావుపై జరిగిన దాడిని సోమవారం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఖండించారు. రెండు రోజుల క్రితం సాంబశివరావుపై అతని కార్యాలయంలోనే కొంతమంది దాడి చేసినందుకు నిరసనగా నాలుగు న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులను బహిష్కరించి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సాంబశివరావు సెల్ ఫోన్‌ను వెంటనే పోలీసులు ఇప్పించాలని, ఆయనకు భద్రత కల్పించాలని, న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని పోలీసులకు వినతి పత్రాన్ని అందించారు.

పల్లెగుంతలో స్పెషల్ రేషన్‌కార్డు సేకరణ



పల్లెగుంతలో నిర్వహిస్తున్న స్పెషల్ రేషన్ కార్డు సేకరణ కార్యక్రమం

గురజాలటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెగుంత గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం స్పెషల్ రేషన్ కార్డు సేకరణ నిర్వహించారు. కొత్త రేషన్ కార్డులు, యాడింగ్, డిలీట్ దరఖాస్తులు కొత్తవి సేకరించారు. అలాగే ప్రతి రోజూ సచివాలయంలో దరఖాస్తుల సేకరణ ఉంటుదని, దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణనాయక్, టీడీపీ నేత జాస్తి ప్రకాష్, వీఆర్వో మరియదాసు, డిజిటల్ అసిస్టెంట్ సలీం బాష తదితరులు పాల్గొన్నారు.

చలో వరంగల్‌ను జయప్రదం చేయాలి

● ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మార్క్

మాచర్ల రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే పద్మశ్రీ అవార్డును ఈనెల 27వ తేదీన స్వీకరించి 31న వరంగల్ వస్తున్న మహజన నేత మందకృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు నిర్వహించనున్న చలో వరంగల్‌ను జయప్రదం చేయాలని ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మార్క్ కోరారు. సోమవారం మండలంలోని విజయపురిసౌత్‌లో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యాన అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు గడ్డిపర్తి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్, మీసాల దానియేలు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహా భాగ్యం

సత్తెనపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్యమే మహా భాగ్యమని జూనియర్ డివిజన్ ప్రధాన సివిల్ జడ్జి తౌషిత్ హుస్సేన్ అన్నారు. సోమవారం బార్ అసోసియేషన్ హాల్లో కోనాక్ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు, న్యాయమూర్తులకు ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మరో న్యాయమూర్తి సుజన్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగూరి అజయ్ కుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి..

రెంటచింతల, మే 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో అంగీకరించిన డిమాండ్స్‌కు వెంటనే జీవో విడుదల చేయాలని లేబర్‌కోడ్ రద్దు చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శివకుమారి డిమాండ్ చేశారు. సోమవారం పీహెచ్‌సీ ఆశ వర్కర్ల సమావేశం అధ్యక్షురాలు పుష్పలత అధ్యక్షతన ఏర్పాటైన సమావేశంలో శివకుమారి మాట్లాడుతూ 20 ఏళ్లుగా పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్నప్పటికి కనీస వేతనాలు, చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మెటర్నిటీ లీవ్, ఇన్సూరెన్సు, వయోపరిమితి పెంపు, మట్టి ఖర్చులు తదితర డిమాండ్లను అంగీకరించి అమలు చేయాలని కోరారు..ఈ సమావేశంలో పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత పేరయ్య చౌదరికి నివాళి

రెంటచింతల, మే 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడులోనే టీడీపీ సీనియర్ నేతల్లో ఒకరైన లేళ్ల పేరయ్య చౌదరి 13వ వర్ధంతి సోమవారం రెంటచింతల బస్టాండ్ సెంటర్లో పార్టీ నేతలు నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి అభి వృద్ధి సంక్షేమానికి చేసిన సేవలను గుర్తు చేశారు. తహసీల్దార్ డీ మేరీ కనకం ముఖ్యఅతిథిగా హాజరై పేరయ్య సేవలను గుర్తు చేస్తూనే లస్సీ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో 2 శివనాగేశ్వరరావు, లేళ్ల శ్రీనివాసరావు, రాజారెడ్డి, కాపూరి నాగయ్య, మాజీ ఎంపీటీసీ శివయ్య, సుంకయ్య, పాస్టర్ ఐజాక్, ఎన్ శ్రీనివాసరావు, బిచ్చిరెడ్డి,పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఏడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకూరపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు మండలంలోని ఏడు గ్రామాల్లో ఈనెల 27వ తేదీ విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ దాసరి రామకృష్ణ సోమవారం తెలిపారు. మండలంలోని లగడపాడు, కన్నెగండ్ల, బుచ్చయ్యపాలెం, గారపాడు, హుస్సేన్ నగరం, రామాపురం గ్రామాలతో పాటు సత్తెనపల్లి మండలంలోని గుజ్జర్లపూడి గ్రామంలో కూడా విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ మార్పును గమనించి సహకరించ గలరని కోరారు.

మహానాడుకు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు



మహానాడుకు బయలుదేరిన వాహనాలను టీడీపీ జెండా ఊపి ప్రారంభిస్తున్న పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, సర్వేశ్వరరావు తదితరులు

పిడుగురాళ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప సమీపంలో నిర్వహించతలపెట్టిన మహానాడు కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యులు సోమవారం అధికసంఖ్యలో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేక వాహనాలను పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు తదితరులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎంసీ చైర్మన్ తురకా వీరస్వామి, కనిగిరి శ్రీను, మాజీ ఎంపీపీ నారాయణ, గండికోట వెంకటేశ్వర్లు, వడ్డవల్లి సాంబశివరావు, పిల్లి చెన్నారావు, వీవీ నాగేశ్వ రరావు, మేకల సాంబశివరావు, జొన్నలగడ్డ శ్రీను, దేవళ్ల రాంబాబు, తదితరులున్నారు.

గిరిజనులు తరలిరావాలి : బాలాజీ నాయక్

దాచేపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): పసుపు పండుగ మహానాడుకు గిరిజనులు తర లిరావాలని ఏపీ టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి గిరిజన విభాగానికి చెందిన బాలాజీనాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కడపలో జరిగే 27, 28, 29 పసుపు పండుగకు గిరిజనులు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీలోని ఎస్టీలకు సముచిత స్థానం లభించటంతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. గిరిజనులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకొని అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.

మహానాడును విజయవంతం చేయాలి

● తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు

రాజుపాలెం, మే 26 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి జరగనున్న తెలుగుదేశం పార్టీ పండుగ మహానాడును విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు పిలుపునిచ్చారు. సోమవారం రాజుపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పెద్దిరాజు మాట్లాడుతూ 43 సంవత్సరాల తెలుగుదేశం పార్టీ చరిత్రలో 2024 ఎన్నికల్లో 93శాతం స్ట్రైక్ రేట్‌తో కూటమి విజయం, ఆ వెంటనే రికార్డు స్థాయిలో కోటికి పైగా సభ్యత్వాల నమోదు ఈ విజయాలకు కారుకులైన కార్యకర్తల పండుగ కావున అందరూ మహానాడుకు తరలిరావాలన్నారు. ముఖ్యంగా రాజుపాలెం మండలం నుంచి భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు హాజరుకావాలన్నారు. మూడురోజుల పాటు జరిగే మహానాడుకు టీడీపీ కార్యకర్తలు తప్పక హాజరుకావాలని కోరారు.

తరలి వెళ్లిన టీడీపీ నేతలు

సత్తెనపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సూచనల మేరకు కడపలో ఈనెల 27 నుంచి జరగనున్న టీడీపీ మహానాడుకు సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ నేతలు, కార్యకర్తలు, యజమానులు అధికసంఖ్యలో వివిధ వాహనాలు, రైళ్ళ ద్వారా మహానాడుకు తరలివెళ్లారు. సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాలకు చెందిన నేతలు ఉన్నారు.

తెలుగుదేశం పార్టీ పండుగకు వెళ్లేందుకు సిద్ధం



మహానాడుకు తరలివెళ్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం

అచ్చంపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల నుంచి కడపలో నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమానికి పలు వాహనాలు ద్వారా సోమవారం సాయంత్రం టీడీపీ నాయకులు తరలివెళ్లారు. రాయలసీమ వేదికగా కడపలో అట్టహాసంగా జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పండుగకు మండలంలోని పలు వాహనాల ద్వారా నాయకులు తరలి వెళ్లేందుకు కూడా సిద్ధమయ్యారు. 27, 28, 29 తేదీల్లో జరిగే మహానాడుకు జెండా ఊపి ప్రారంభించిన మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదంతో పాటు రాయిడి సాంబశివుడు, నెల్లూరి వెంకటయ్య, జంపాని నాని, ఏసుపోగు నాగయ్య, తిరువాయిపాటి ఆంజనేయులు, సందెపోగు వెంకటరావు, కొమ్మవరపు దిబ్బయ్య తదితరులున్నారు.

తెలంగాణకు చుక్కనీరు కూడా అన్యాయం జరగదు

● బీజేపీ రాష్ట్ర కార్యదర్శి హనుమంతురావు

కారంపూడి, మే 26(ఆంధ్రజ్యోతి): సముద్రంలోకి వృథాగా పోతున్న గోదావరి జలాలను ఆంధ్రకు ఉపయోగించుకోవడం వల్ల తెలంగాణ రాష్ట్రానికి చుక్క నీరు కూడా నష్టం వాటిల్లదని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి శెట్టి హనుమంతురావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సముద్రంలోకి నీరు పోకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన కృషి అభినందనీయమన్నారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇచ్చింది విభజన హామీల్లోనే ఉందన్నా రు. రాజకీయ దురుద్దేశంతో బీఆర్ఎస్ నాయకులు లేనిపోని అభాండాలను ఆంధ్రపై రుద్దుతున్నారని, ఆంధ్ర తెలంగాణ ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొంగర లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దోర్నాల నాగిరెడ్డి, నున్నా జనార్దన్, టీడీపీ సీనియర్ నేత కర్నా సైదారావు, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పువ్వాడ శ్రీనివాస్, కోశాధికారి కజ్జం పెద ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


సబ్సిడీ రుణం మంజూరైందని దివ్యాంగులకు టోకరా

గుంటూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సబ్సిడీ రుణం మంజూరు చేసిందని దివ్యాంగులైన భార్యాభర్తలకు ఫోన్ చేసి ఓ వ్యక్తి మోసం చేశాడు. ఈ మేరకు రాజుపాలెం మండలం అనుపాలెంకు చెందిన దివ్యాంగ దంపతులు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అనుపాలెంకు చెందిన దూదేకుల మస్తాన్‌వలికి ఈనెల 24న ఆగంతకుడు ఫోన్ చేశాడు. మీకు దివ్యాంగుల కోటాలో ప్రభుత్వ సబ్సిడీ రుణం మంజూరైందని చెప్పాడు. దానిని ఆన్‌లైన్ చేయాలంటే ఒక్కొక్కరు 6,375 చెల్లించాలని చెప్పడంతో మస్తాన్‌వలి తన పేరుతో తన భార్య పేరుతో వచ్చిందని నమ్మి డబ్బులు పంపాడు. ఆ తర్వాత ఈసీ లంచం అడుగుతున్నారని చెప్పి ఒక్కొక్కరి పేరుతో 2,800 ఫోన్ పే ద్వారా కొట్టించుకున్నాడు. కలెక్టరేట్ కొచ్చి చెక్కు తీసుకువెళ్లమని చెప్పాడు. దీంతో 25న దివ్యాంగ దంపతులు గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం వద్దకు రాగా మరోసారి ఆగంతకుడు ఫోన్ చేసి ప్రస్తుతం తాను కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉన్నానని, అయితే ఆ మొత్తం చెక్కు రూపంలో కాకుండా నేరుగా మీ ఖాతాలోనే జమ చేస్తామని చెప్పాడని అన్నారు. ఇందుకుగాను ఒక్కొక్కరు 2550 చెల్లించాలని చెప్పాడు అన్నారు. ఇలా తాము 20,650 చెల్లించామని, ఆ తర్వాత నుంచి ఆగంతకుడు ఫోను స్విచ్ ఆఫ్ చేశాడు అన్నారు. ఆ దంపతుల ఫిర్యాదు మేరకు సీసీఎస్ అదనపు ఎస్పీ సుప్రజ తక్షణం నిందితులపై చర్యలు తీసుకొని వారికి న్యాయం చేయాలని నగరంపాలెం సీఐని ఆదేశించారు.

రాజకీయ.. రక్తచరిత్ర

- గుండ్లపాడు ఫ్యాక్షన్‌లో 20 మంది మృతి
- ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలు
- ఏ ఒక్క ఘటనలోనూ శిక్ష పడని వైనం
- ఫ్యాక్షన్ ముఠాలకు రాజకీయ అండదండలు

కష్టించే మనస్తత్వం, పంటలు పండే సారవంతమైన భూములు, పచ్చని పంట పొలాలు ఉన్నప్పటికీ గ్రామ పెత్తనం కోసం అనాగరికంగా హత్యలకు పాల్పడడం ఆ గ్రామం స్పెషాలిటీ. పల్నాడు జిల్లాలో అత్యంత ఫ్యాక్షన్ గ్రామమేదైనా ఉందంటే అది వెల్దుర్తి మండలంలోని గుండ్లపాడు గ్రామంగా చెప్పుకోవచ్చు. విద్య, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకొని పల్నాడులోని అన్ని గ్రామాల్లో మార్పులు కోరుకుంటుంటే దానికి భిన్నంగా ఈ గ్రామంలో మాత్రం కక్షలు, కార్పణ్యాలకు అధిక ప్రాధాన్యత నిస్తున్నారు. పిల్లలకు వారసత్వంగా ఆస్తులు, విద్యను అందించాల్సిన పెద్దలు ఫ్యాక్షన్‌లో పాల్గొని అర్థాంతరంగా తనువు చాలిస్తూ తరువాత తరం వారికి ఫ్యాక్షన్ మరకలు వారసత్వంగా పంచుతున్నారు. ఇలా గుండ్లపాడు గ్రామంలో ఫ్యాక్షన్‌తో అన్నదమ్ములు, బావా బావమరుదులు, సొంత సామాజిక వర్గం తేడా లేకుండా కుటుంబ పెద్దలను కోల్పోయి ఆయా కుటుంబాలు ఆర్థికంగా చితికి పోయి నేటికి దుర్భర జీవితాలు కొనసాగిస్తున్నాయి.





గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో వాహనాలను దహనం చేసిన దృశ్యం



జెవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య) మృతదేహం (ఫైల్‌ఫోటో)



జెవిశెట్టి కోటేశ్వరరావు మృతదేహం (ఫైల్)

మాచర్లటౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో 1971లో ప్రారంభమైన ఫ్యాక్షన్ హత్యలు నేటి వరకు 20కు చేరుకున్నాయి. రాజకీయ ఆధిపత్యం కోసం అధికారంలో ఎవరుంటే వారు గ్రామాన్ని ఏలుకుంటూ ప్రత్యర్థులను హతమార్చుతూ గ్రామం నుంచి తరిమేస్తున్నారు. అధికారం వచ్చాక తిరిగి ప్రత్యర్థులపై కక్ష తీర్చుకుంటున్నారు. గ్రామంలో పెరిక, వడ్డెర, ఎస్సీ సామాజిక వర్గాల ప్రజలు అధికంగా ఉన్నారు. పెరిక సామాజిక వర్గం రెండుగా చీలి జెవిశెట్టి పెద నాగయ్య, సాని రామయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులుగా, దొంగరి చిన వీరయ్య ఇండిపెండెంట్ అభ్యర్థి జూలకంటి నాగిరెడ్డికి మద్దతు దారుడిగా పెత్తనం సాగించారు. గ్రామంపై ఆధిపత్యం కోసం ఈ రెండు వర్గాల మధ్య జరిగిన దాడుల్లో 1971లో మొదటిసారిగా దొంగరి చిన వీరయ్య హత్య జరిగింది. తరువాత 1989లో తిరిగి ఫ్యాక్షన్ పురుడు పోసుకుంది. కాంగ్రెస్ పార్టీకి ప్రత్యర్థి పార్టీగా నూతనంగా పుట్టుకొచ్చిన టీడీపీ పార్టీల మధ్య వర్గపోరు మొదలైంది. తోట కృష్ణమూర్తి, దొంగరి నాగేశ్వరరావు, చింతా చిన వీరయ్యలు టీడీపీ నాయకులుగా కొనసాగగా 1989లో రెండు వర్గాలు నాటుబాంబులతో దాడులకు దిగారు. ఈ దాడిలో టీడీపీకి చెందిన చింతా పెద వీరయ్య, కాంగ్రెస్ పార్టీకి చెందిన చింతా చిన మల్లయ్యలు హత్యకు గురయ్యారు. 1990లో టీడీపీకి చెందిన సాని కొండలు హత్యకు గురయ్యాడు. కొండలు హత్యకు ప్రతీకారంగా 1991లో కాంగ్రెస్‌కు చెందిన తోట రాములును హత్య చేశారు. తదుపరి టీడీపీకి చెందిన తోట దుర్గా మల్లయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1993లో గ్రామాన్ని విడిచి శిరిగిరిపాడులో నివాసముంటూ ప్రత్యర్థుల కోసం నాటుబాంబులు తయారు చేస్తుండగా ప్రమాదవశాత్తూ అవి పేలి దొంగరి నాగేశ్వరరావు, సాని చిన కోటయ్య, సాని పుల్లయ్య, చింతా కొండలు, చింతా పెద కోటయ్య ప్రాణాలు కోల్పోయారు. 1995లో టీడీపీకి చెందిన గుడిబండ్ల బంగారయ్యను ప్రత్యర్థులు హత్య చేశారు. 1996లో వడ్డెర సామాజిక వర్గం రెండు వర్గాలుగా విడిపోయి టీడీపీ, కాంగ్రెస్ గ్రూపుల్లో చేరిపోయాయి. కాంగ్రెస్‌కు చెందిన ఉప్పుతోళ్ల రాములును ప్రత్యర్థులు బాంబులు వేసి హత్యచేశారు. తరువాత ఉప్పుతోళ్ల నాగేశ్వరరావును ప్రత్యర్థులు హత్య చేశారు. 1997లో టీడీపీకి చెందిన దొంగరి నాగయ్య గుండ్లపాడు గ్రామంలో హత్యకు గురయ్యాడు. 1999లో కాంగ్రెస్, టీడీపీ గ్రూపులు రాజీ కుదుర్చుకొని ఫ్యాక్షన్‌కు స్వస్తి పలికారు. తిరిగి 2022 జనవరి 13న టీడీపీకి చెందిన తోట చంద్రయ్యను వైసీపీకి చెందిన చింతా శివరామయ్య హత్య చేశారు. తాజాగా టీడీపీకి చెందిన జెవిశెట్టి వెంకటేశ్వర్లు (మొద్దయ్య), అతని సోదరుడు కోటేశ్వరరావులను ఇటీవల వైసీపీ నుంచి టీడీపీలో చేరిన జెవిశెట్టి శ్రీనివాసరావు (బెబ్బులి), తోట వెంకట్రామయ్యలు హత్యకు పాల్పడ్డారు.

హత్య కేసులన్నీ రాజీలే..

గుండ్లపాడులో జరిగిన హత్యల్లో ఏ ముఠాకు చెందిన నిందితులకు కూడా శిక్ష పడకపోవడం గమనార్హం. హత్యలు జరిగిన తరువాత బెయిల్ పొంది శిక్ష పడే సమయానికి ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవడం, శిక్షలు పడకుండా బయటపడడం ఆనవాయితీగా మారింది. దీంతో ఏ వర్గానికి కూడా భయం లేకుండా పోయింది. దీనికితోడు రాజకీయ నాయకులు వారి ఎదుగుదల కోసం గ్రామంలో ఫ్యాక్షన్ ముఠాలను పెంచి పోషించడం జరుగుతోంది. ఇలా ఫ్యాక్షన్ ఘర్షణలో కుటుంబ పెద్దలను కోల్పోయి ఆర్థికంగా చితికిపోయి ఆయా కుటుంబాల సభ్యులు తీవ్ర దుర్భర పరిస్థితుల్లోకి నెట్టబడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ప్రత్యర్థి పార్టీ వారిని గ్రామం నుంచి తరిమివేయడం, ప్రత్యర్థి పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక మరలా గ్రామంలోకి వచ్చి కక్షసాధింపులకు పాల్పడడం రివాజుగా మారింది. ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా, అన్నదమ్ములైనా, బావా బావమరుదులైనా ఫ్యాక్షన్ రక్కసిలో ఇరుక్కొని ప్రాణాలు కోల్పోతున్నారు. గుండ్లపాడు గ్రామంలో విస్తారంగా సారవంతమైన భూములుండి పంటలు పండిస్తూ కష్టించే మనస్తత్వం ఉన్న మహిళామణులున్నప్పటికీ ఆధిపత్యం కోసం పురుషులు ఫ్యాక్షన్ వైపు మొగ్గు చూపి కుటుంబాలను కష్టాల్లోకి నెట్టబడుతున్నారు. ప్రభుత్వాలు సీరియస్‌గా తీసుకొని గుండ్లపాడు గ్రామంలో ఫ్యాక్షన్ మూలాలను సమూలంగా తొలగించి ఆ ప్రజలకు విద్యతోపాటు ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసి మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.



ప్రకృతి వ్యవసాయం చేద్దాం.. భూమాతకు జీవం పోద్దామంటూ ఆంధ్రప్రదేశ్ లోగో కనిపించేలా 30 రకాల విత్తనాలతో తన పంట పొలంలో వేసిన సుందర దృశ్యం

ప్రకృతి సేద్యంతో.. భూమాతకు జీవం

- అత్తోటలో ప్రకృతి వ్యవసాయదారుడి వినూత్న ఆకృతిలో సాగు
- పరిశీలించిన కాశ్మీర్, లఢక్ విద్యార్థినులు

తెనాలి, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వైపరీత్యాలను నివారించేందుకు సహజ సిద్ధమైన ప్రకృతి సాగు ఎంతో దోహదపడుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించే దిశగా ప్రకృతి సాగుకు అందరు మొగ్గు చూపాలంటూ ప్రకృతి వ్యవసాయదారుడు, యర్రు బాపారావు వినూత్న రీతిలో సందేశాత్మక ఆకృతిని చూపుతూ సాగు చేసిన చిత్రం ఆకర్షణగా నిలిచింది. గుంటూరు జిల్లా కొల్లిపర మండలం, అత్తోటకు చెందిన రైతు బాపారావు "ప్రకృతి వ్యవసాయం చేద్దాం.. భూమాతకు జీవం పోద్దాం" అనే అక్షరాలు కనిపిస్తూ దాని మధ్యలో ఆంధ్రప్రదేశ్ మ్యాప్‌ను తీర్చిదిద్దేలా 40 రోజుల క్రితం 30 రకాల విత్తనాలతో నాటు వేశారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్ఎఫ్) విధానంలో ముందుకు వెళ్లేలా తమ ప్రకృతి సాగు చిత్రాన్ని ఆవిష్కరించారు. భూమి బాగుంటే మనిషి కూడా బాగుంటాడని, ప్రస్తుతం ఏర్పడుతున్న ప్రకృతి వైపరీత్యాలకు ఊహించని విపత్తులకు పర్యావరణ సమతుల్యత లోపమే కారణమనేది తెలియజేప్పాలనేదే తన ఉద్దేశమని రైతు బాపారావు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రకృతి సాగు అధ్యయనంలో భాగంగా జమ్మూ కాశ్మీర్, లఢక్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సోమవారం అత్తోట వచ్చి ఇక్కడ రైతులు చేపడుతున్న సాగును పరిశీలించారు.

ప్రకృతి సాగు ఎంత మేలు చేస్తుందో అర్థం చేసుకున్నాం..

- తంజీర్ ఖాన్, జమ్మూ కాశ్మీర్



రూరల్ డెవలప్‌మెంట్‌లో పీజీ చేస్తున్న నేను ప్రకృతి సాగును ఆంధ్రప్రదేశ్ చేపడుతున్న రైతుల వివరాలు తెలుసుకుని పరిశీలించేందుకు వచ్చాం. అత్తోట రైతులు చేపడుతున్న సాగు విధానాలు, భూ పరిరక్షణ చర్యలు, మమ్మలను ఆకట్టుకున్నాయి. ప్రకృతి సాగుపై అనేక మెలకువలు తెలుసుకున్నందుకు సంతోషంగా ఉంది.

భూటాన్ సరిహద్దుల్లోనూ ప్రకృతి సాగు చేస్తాం..

- పద్మలాజేష్, భూటాన్ - టిబెట్ సరిహద్దు లఢక్ విద్యార్థిని



ప్రకృతి సాగు వల్ల లాభాలు పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ అధ్యయనంలో తెలుసుకున్నాం. భవిష్యత్ తరాలకు మా ప్రాంతంలో వీటిని అందించేందుకు ప్రయత్నం చేస్తాం. భూటాన్ - టిబెట్ సరిహద్దులో కూడా ప్రకృతి సాగు చేపడతాం. మా ప్రాంతాల వారికి ఇక్కడ సాగు విధానాలను తెలియజేసి మెరుగైన ఫలితాలు సాధించడానికి మా వంతు సహకారం అందిస్తాం.

కార్పొరేట్‌కు దీటుగా.. ప్రభుత్వ కళాశాలలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏడాది నుంచి సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థిని విద్యార్థులు చదివే ఈ కళాశాలల్ని ఉన్నతంగా తీర్చిదిద్ది మెరుగైన విద్యతోపాటు విద్యార్థులకు అవసరమైన రాష్ట్ర, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు శిక్షణను ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధమైంది. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత జూనియర్ కళాశాలల్లో భారీస్థాయిలో సంస్కరణలు ప్రారంభం అయ్యాయి.

- ఎంసెట్, జేఈఈ, నీట్ పరీక్షకు ప్రత్యేక శిక్షణ



గుంటూరు (విద్య), మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మరొక ఎయిడెడ్ జూనియర్ కళాశాల ఉన్నాయి ఆ కళాశాలలో దాదాపు 15 వేల మందికి పైగా విద్యార్థులు ఇంటర్ విద్యను అభ్యసిస్తున్నారు. ప్రస్తుతం వీటితోపాటు ప్లస్ టు కళాశాలలు కూడా విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు కళాశాలల్లో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పూర్తిస్థాయిలో ఫర్నీచర్, తరగతి గదులు, విద్యార్థినీ విద్యార్థులకు అవసరమైన ల్యాబ్ పరికరాలు, ఆటస్థలం, మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు కల్పిస్తున్నారు. వీటితోపాటు గత ఏడాదినుంచి విద్యార్థినీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్ అందిస్తున్నారు. ఇంకా అనేక కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు.

పోటీ పరీక్షలకు మెరుగైన శిక్షణ...

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్పొరేట్ స్థాయిలో విద్యార్థినీ విద్యార్థులను జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు శిక్షణ అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు ఇందుకోసం గుంటూరు నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను నోడల్ సెంటర్‌గా ఏర్పాటుచేసి ఎంసెట్‌తో పాటు జేఈఈ, జేఈఈ అడ్వాన్స్ నీట్ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లాలోని 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్ని అనుసంధానం చేస్తూ ఈ శిక్షణ అందించడానికి ఏడాది కార్యాచరణ సిద్ధం చేశారు. ఇందు కోసం అవసరమైన పుస్తకాలను కూడా ఇంటర్‌బోర్డు త్వరలో విద్యార్థినీ విద్యార్థులకు అందించనుందని అధికారులు చెబుతున్నారు.

పుస్తకాలు పంపిణీ పూర్తి

అవసరమైన పుస్తకాలను ఇప్పటికే పంపిణీ చేశారు. మారిన సిలబస్ కనుగుణంగా ఈ పుస్తకాలను రూపొందించి పంపిణీ చేశారు వేసవి సెలవులకు ముందే ఈ కార్యక్రమాన్ని ఇంటర్ బోర్డు పూర్తి చేసింది.

అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అందించే సౌకర్యాలను విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ప్రత్యేకంగా అధ్యాపకుల ద్వారా అడ్మిషన్లు కోసం క్యాంపులు నిర్వహించి ఇక్కడ ఉన్న సౌకర్యాలు వివరించారు. విద్యార్థులకు అవసరమైన సమస్త సౌకర్యాలు ప్రస్తుతం కళాశాలలో అందుబాటులో ఉన్నాయని మెరుగైన బోధన అందించే అధ్యాపకులు అందుబాటులో ఉన్నట్లు వివరించారు.



జనరల్ బోగీలు నాటికలోని ఓ సన్నివేశం

నాటిక పోటీలతో సమాజానికి మంచి సందేశం

- ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నాదెండ్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): నాటిక పోటీల ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని అందించ వచ్చని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. మండలంలోని సాతులూరు గ్రామంలో నటరత్న ఎన్‌టీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో జరుగుతున్న తృతీయ జాతీయ స్థాయి పోటీల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని, పలువురికి ఎన్‌టీఆర్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. కళాకారుడు వీసీ హెచ్ ప్రసాదు, పి.ఓబులయ్య, ఆడిటర్ బొల్లేపల్లి శ్రీనివాసరావు, మీరయ్యకు ఎన్‌టీఆర్ అవార్డు అందజేసి సన్మానించారు. కాగా జనరల్ బోగీలు నాటిక పలువురిలో ఆలోచన రేకెత్తించింది. ఒక ఉపాధ్యాయురాలు కుమారుడు జనరల్ బోగీలో ప్రయాణిస్తూ రైల్వే యాక్సిడెంట్‌లో మృతి చెందగా.. న్యాయం కోసం ఆమె చేసిన పోరాటం ప్రేక్షకుల్లో ఆలోచింపజేసింది. రిజర్వేషన్ ఉన్న వారికేనా సాయం అందేది, జనరల్ బోగీల ప్రయాణికులు ఎందుకు అందదంటూ నాటికలోని సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అదే విధంగా రే చీకటి భార్య, భర్తల కథనంతో రూపొందిన దొందుదొందే నాటిక ప్రేక్షకులను నవ్వించింది. అధిక సంఖ్యలో తరలి వచ్చిన ప్రేక్షకులతో నాటిక పోటీలు కోలాహలంగా సాగుతున్నాయి.



బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం, వ్యవసాయ కళాశాల క్షేత్రం ద్వారా బ్రీడర్, ఫౌండేషన్ సీడ్ రైతులకు అందజేత

బీపీటీ వంగడాల విక్రయం ప్రారంభం

- వ్యవసాయ కళాశాల క్షేత్రం ద్వారా ఫౌండేషన్ సీడ్
- పరిశోధన స్థానం ద్వారా బ్రీడర్ సీడ్

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం రైతులకు బ్రీడర్ సీడ్ విక్రయాలు ప్రారంభించింది. అదేవిధంగా వ్యవసాయ కళాశాల క్షేత్రం రైతులకు ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తోంది. 30 కిలోల బ్యాగ్‌లను రైతుల అవసరాన్ని బట్టి, ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యమిస్తూ విక్రయిస్తున్నారు. రుతుపవనాలు ముందుగా రావడం, వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో.. జూన్ నుంచి వెద సాగుకు, నారుమడులు పోసేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ముందస్తుగా విత్తనాలు కోసం బాపట్ల పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానంలో బ్రీడర్ సీడ్ బీపీటీ 2595 (తేజ) రకం 30 క్వింటాళ్లు, బీపీటీ 2846 రకం 20 క్వింటాళ్లు, బీపీటీ 2270 (భావపురి సన్నాలు) రకం 60 క్వింటాళ్లు, బీపీటీ 2231 (అక్షయ) రకం 6క్వింటాళ్లు, బీపీటీ 2295 (బాపట్ల మసూరి)రకం 5 క్వింటాళ్లు, బీపీటీ 2841 రకం 15 క్వింటాళ్లు, బీపీటీ 3291 (సోనా మసూరి) రకం 6 క్వింటాళ్లు, బీపీటీ 2782 (భవతి) రకం 30 క్వింటాళ్లు, బీపీటీ 3082 రకం 35 క్వింటాళ్లు, బీపీటీ 2766 రకం 10 క్వింటాళ్లు చొప్పున విత్తనాలు అందుబాటులో ఉంచారు. అదేవిధంగా వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద ఫౌండేషన్ సీడ్ బీపీటీ 2846 రకం 84 క్వింటాళ్లు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. బాపట్ల వ్యవసాయ కళాశాల క్షేత్రం ఫౌండేషన్ సీడ్ విక్రయిస్తోంది. అందులో బీపీటీ 5204 (సాంబ మసూరి), బీపీటీ 2270 (భావపురి సన్నాలు), బీపీటీ 2782 (భవతి), బీపీటీ 2595 (తేజ) రకాల విత్తనాలు 1,560 క్వింటాళ్లు రైతులకు విక్రయించేందుకు సిద్ధం చేసి విక్రయిస్తున్నారు. మొత్తం 3 వేల బ్యాగ్‌లను రైతులకు విక్రయించనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఇ.అరుణ తెలిపారు.

బ్రీడర్ సీడ్ 30 కిలోల బ్యాగ్ రూ.2,334



వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా బ్రీడర్ సీడ్ 30కిలోల బ్యాగ్ రూ.2,334, ఫౌండేషన్ సీడ్ బ్యాగ్ రూ.1,450 కు విక్రయిస్తున్నాం. ఇప్పటి వరకు బ్లాక్ రైస్, రెడ్‌రైస్ విత్తనాలు రెండు కిలోల మినీ కిట్‌లను దరఖాస్తు చేసుకున్న రైతులందరికి ఇవ్వడం జరిగింది. మిగిలిన రకాలు అందుబాటులో ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి వెరైటీలు పూర్తిగా విక్రయిస్తున్నారు. అవసరమైన రైతులు ముందుగా దరఖాస్తు పెట్టుకొని విత్తనాలు పొందవచ్చు.

- డాక్టర్ బి.కృష్ణవేణి, ప్రధాన శాస్త్రవేత్త, బాపట్ల వ్యవసాయ పరిశోధన స్థానం

రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

గుంటూరు (విద్య) మే 26 (ఆంధ్రజ్యోతి): గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశం కోసం సోమవారం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ఏపీఆర్జేసీ సెట్ నిర్వహించిన విషయం తెలిసిందే. ఆంధ్ర రీజియన్ పరిధిలోని వివిధ జిల్లాల నుంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ రీజియన్ పరిధిలో తోటకూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల, నిమ్మకూరు బాలుర, బాలికల కళాశాల, నాగార్జున సాగర్‌లోని బాలుర కళాశాల, గుంటూరులోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రెసిడెన్షియల్ కళాశాల, వెంకటగిరిలోని రెసిడెన్షియల్ కళాశాలల్లో 299 సీట్లకు ప్రవేశాల కోసం తొలిరోజు 1:5 నిష్పత్తిలో విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలిచారు. మొత్తం 1,328 మంది విద్యార్థిని విద్యార్థులు కౌన్సెలింగ్ హాజరుకాగా 131మంది బాలురు, 33మంది బాలికలకు సీట్లు కేటాయించారు. మంగళవారం బైపీసీ విద్యార్థులకు, బుధవారం ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్స్ వెల్లడించారు. కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండీ ఖాసిం సందర్శించారు. విద్యార్థులు, సిబ్బందికి కల్పించిన భోజన, ఇతర వసతులను ఆయన పర్యవేక్షించారు.



ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కో-ఆర్డినేటర్స్


శిథిలావస్థలు..!

- మరమ్మతులకు నోచుకోని ఇరిగేషన్ కార్యాలయం

బాపట్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఏడాది శిథిలావస్థ కాల్వలకు మరమ్మతులు చేపట్టే.. ఇరిగేషన్ అధికారులు.. తాము విధులు నిర్వహించే కార్యాలయానికి మాత్రం మరమ్మతులు చేయించుకోలేక పోతున్నారు. దీంతో శిథిలావస్థ భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతున్నాయి. తలుపులు ధ్వంసమై పనికిరాకుండా పోయాయి. అయినప్పటికి అధికారులు అందులోనే ఉండి తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. 1954 సంవత్సరానికి ముందు బాపట్ల పట్టణ నడిబొడ్డున గడియార స్తంభం పక్కనే జీబీసీ రోడ్డులో ఈ భవనాన్ని నిర్మించారు. బాపట్ల వెస్ట్రన్ సబ్ డివిజన్ అధికారులతోపాటు చీరాల డివిజన్ అధికారులు కూడా ఇక్కడే ఉండి.. తమ పరిధిలోని సాగునీటి కాల్వలను పర్యవేక్షిస్తుంటారు. ఇప్పటి వరకు ఈ కార్యాలయం నుండి 58మంది డీఈలు విధులు నిర్వహించారు. అయినప్పటికి పై అంతస్తు శిథిలమైనా పట్టించుకోలేదు. కింద అంతస్తు పటిష్టంగా ఉన్నప్పటికీ.. ఆ తర్వాత నిర్మించిన పై అంతస్తు మాత్రం శిథిలావస్థకు చేరింది. దీంతో అధికారులు కార్యాలయ గదుల్లో ఉండటానికి సిబ్బంది భయపడుతున్న పరిస్థితి నెలకొంది. పైఅంతస్తు ఎప్పుడైనా.. కూలిపోయే ప్రమాదం పొంచి ఉంది.



పూర్తిగా దెబ్బతిన్న ఇరిగేషన్ ఏఈ గది తలుపు పెచ్చులూడి పడుతున్న శ్లాబ్ పై అంతస్తు దృశ్యం



దెబ్బతిన్న ఇరిగేషన్ కార్యాలయం పై అంతస్తు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

వినుకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని భారతాపురం, నడిగడ్డ, తిమ్మాయపాలెం, వెంకుపాలెం గ్రామాల్లో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, భాగ్యలక్ష్మి, సర్పంచ్‌లు సంతోషం, రమణకుమారి, మండల రిసోర్సు కో ఆర్డినేటర్ ప్రభాకర్, సచివాయల సిబ్బంది, గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



స్థల పరిశీలన చేస్తున్న వైద్య బృందం

మత్తు వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

నరసరావుపేట లీగల్, మే 26 (ఆంధ్రజ్యోతి), పట్టణంలోని లింగంగుంట్లలోని ప్రభుత్వ వైద్యశాలలో రెండో అంతస్తులో త్వరలో మత్తు వ్యసన విముక్తి కేంద్రం ఏర్పాటుచేయనున్నట్లు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి సొసైటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం స్థలాన్ని గుర్తించేందుకు సమగ్ర పరిశీలన చేశారు. అనంతరం అన్ని ప్రమాణాలు, మార్గదర్శకాలకు అనుగుణంగా, రెండో అంతస్తు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించారు. త్వరలో 15 పడకలతో మత్తు వ్యసన విముక్తి కేంద్రం ప్రారంభం కానుంది. పరిశీలన కార్యక్రమంలో డీసీహెచ్ ఎస్.డాక్టర్ ప్రసూన, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలి

● సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకుల వినతి

వినుకొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణంలోని వెల్లటూరురోడ్డులోని సర్వే నెం.212లో 175సెంట్ల సీలింగ్ లాండ్‌ను మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తప్పుడు పత్రాలతో రికార్డులు సృష్టించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని, ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దుచేసి ఎకరా 75సెంట్ల భూమిని నిరుపేదలకు ఇళ్ల స్థలాలకు కేటాయించాలంటూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్‌పార్టీ జిల్లా కార్యదర్శి తోట ఆంజనేయులు డిమాండ్ చేశారు. 1976 సీలింగ్ చట్టం ప్రకారం గోనుగుంట్ల వెంకటేశ్వరరావుకు చెందిన 175 సెంట్లు ప్రభుత్వానికి అప్పజెప్పడం జరిగిందన్నారు. ఆ భూమిని ఇప్పటికైనా నిరుపేదలకు పంపిణీ చేయాలంటూ స్థానిక తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దూపాటి నాని, వెంకటేశ్వర్లు, భాస్కర్, ప్రసాద్, సాయిబాబా, గుంటి నాగేశ్వరరావు,వెంకటేశ్వర్లు, యలమంద, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

28న కుక్కపల్లివారిపాలెం ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ

చిలకలూరిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం కుక్కపల్లివారిపాలెంలో ఈ నెల 28వ తేదీన సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు సోమవారం తెలిపారు. వంద సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరడంతో గత రెండున్నర సంవత్సరాలుగా రూ.1.5కోట్లు ఖర్చుచేసి పునః నిర్మాణం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహేంద్ర సంఘం అధ్యక్షుడిగా మస్తాన్‌రావు ఎంపిక

వినుకొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహేంద్ర (మేదరి) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా జొరిగె మస్తాన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా పోలేపల్లి నాగేంద్ర, కోశాధికారిగా సిరిగిరి మంగారావు, ప్రచార కార్యదర్శిగా పిల్లి మాణిక్యరావు, సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మేదర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జొరిగె మస్తాన్‌రావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల్లో తమ కులాన్ని ఎస్సీ, ఎస్టీల్లో ఉన్నారని, గత ఎన్నికల హామీలో భాగంగా తమ కులాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఎస్సీ, ఎస్టీలో జాబితాలో చేర్చాలన్నారు. ఎస్టీ జాబితాలో చేర్చి సబ్సిడీపై వెదురు సప్లయ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ఏల్లాలుబాబు, డి.ఏసుబాబు, ఎస్.హనుమాన్‌ప్రసాద్, జొరిగె శ్రీనివాసరావు, వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి

వినుకొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలో గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తుతెలియని యువకుడు ఆదివారం మృతిచెందినట్లు స్థానిక పోలీసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతదేహాన్ని 108 సిబ్బంది సాయంతో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీకి తరలించామని ఆచూకీ తెలిసిన వారు వినుకొండపట్టణ పోలీస్‌స్టేషన్‌లోసంప్రదించాలని సీఐ శోభన్ బాబు తెలిపారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి: కలెక్టర్

నరసరావుపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పీ అరుణబాబు ఆదేశించారు. నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి 171 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్‌వో, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుడు ఎం.సుధాకర్ వద్దకు వెళ్లి సమస్యను తెలుసు కుంటున్న కలెక్టర్ పీ అరుణ్‌బాబు తదితరులు

దివ్యాంగుడి వద్దకు కలెక్టర్

కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం బొల్లాపల్లి కిచెందిన దివ్యాంగుడు ఎం.సుధాకర్ వీల్‌చైర్‌లో అర్జీ ఇచ్చేందుకు వచ్చాడు. కలెక్టర్ పీ అరుణ్‌బాబు సుధాకర్ వద్దకు వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సెర్ప్ సీఈవోతో ఫోన్లో మాట్లాడి పింఛన్ సమస్యను తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బీ రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై 1100కు ఫిర్యాదు చేయండి

పరిష్కార వేదికకు హాజరు కాలేని వారు టోల్ ఫ్రీ నంబరు 1100కు ఫోన్‌చేసి ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ అరుణ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి ఫిర్యాదులను నేరుగా కలెక్టరేట్‌లో, లేదా ఆయా మండలాలలో సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గాని ఫిర్యాదులు సమర్పించవచ్చున్నారు. ఇచ్చిన ఫిర్యాదు స్థితి దానికి సంబంధించి సమాచారం ఏమన్నా తెలుసుకోవాలి అనుకుంటే 1100కి ఫోన్ చేయవచ్చని కలెక్టర్ చెప్పారు. మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నేరుగా నమోదు చేసుకోవచ్చునని వివరించారు.

శేషిరెడ్డి అవినీతిపై విచారణ జరిపించాలి

పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాల మాజీ అభివృద్ధి కమిటీ చైర్మన్ శేషిరెడ్డి అవినీతిపై విచారణ జరిపించాలని ఎంబీఎం ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే కరిముల్లా డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌కే కరిముల్లా మాట్లాడుతూ అప్పటి అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారన్నారు. కరోనా సమయంలో పీపీ కిట్లు, మందులు, బెడ్‌షీట్లు, రోగులకు భోజనాలు, వసతుల పేరుతో, పారిశుధ్య సామగ్రి అక్రమంగా సొంత ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు. వాటిని అక్రమంగా విక్రయించారని, దీనివలన కరోనా వైరస్ సోకిన అనేక మంది చికిత్స అందక మృత్యువాత పడ్డారన్నారు. ఈ అవినీతిపై విచారణ జరిపి ప్రభుత్వం నష్టపోయిన కోట్ల రూపాయలు డాక్టర్ శేషిరెడ్డి నుంచి రికవరీచేసి, అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరారు.

మరో 40 ఏళ్లు అధికారంలోనే తెలుగుదేశం

మంత్రి లోకేశ్‌ను టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేస్తే

● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
● జనసమీకరణపై పులివెందుల నేతలతో సమావేశం
● కడప మహానాడు విజయవంతం చేయాలని పిలుపు

వినుకొండ, మే 26, (ఆంధ్రజ్యోతి) మంత్రి లోకేష్‌కు ఇప్పుడే తెలుగు దేశం పార్టీ కార్యనిర్వాహణ అధ్యక్ష పదవి ఇస్తే పార్టీ 40 ఏళ్ల అధికారంలోనే ఉంటుందని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి ఆంజనేయులు తెలిపారు. ఈనెల 27,28, 29 తేదీల్లో కడపలో జరుగు తెలుగు దేశం మహానాడు కార్యక్రమంలో బాగంగా పులివెందుల తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో పార్టీ పరిశీలకుడు ఆదినారాయణ, బీటెక్ రవితో కలిసి నియోజకవర్గం ముఖ్య నేతలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ పార్టీలోను, ప్రజల్లో, ప్రభుత్వంలో తనను తాను నిరూపించుకున్న ఆయనకు ఆ బాధ్యత ఇచ్చేందుకు ఇదే సరైన సమయం అన్నారు. తెలుగుదేశం పార్టీ కోటి మంది క్రియాశీలక సభ్యత్వం గల కార్యకర్తలు, యువత, మేధావులు, విద్యావేత్తలు కూడా అదే ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. కడపలో మూడు రోజులు పాటు నిర్వహిస్తున్న మహానాడును విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. నియోజకవర్గం నుంచి 15 వేలమందికి పైగా తరలివస్తున్నారని చెప్పారు. ఈ మహానాడు ద్వారా తెలుగుదేశం పార్టీ నాలుగు దశాబ్ధాలకు మహాశక్తిగా మలిచే ప్రయత్నం జరుగుతుందన్నారు. కడప ప్రాంతంలో చంద్రబాబు హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు బ్రహ్మాండంగా ముందుకు సాగుతున్నాయన్నారు. రాజశేఖరెడ్డి హయాంలో మొదలు పెట్టిన పనులు పూర్తికాని వాటిని కూడా తర్వాత పూర్తి చేయడాన్ని ప్రజలంతా అభినందిస్తున్నారని తెలిపారు. గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు రాయసీమ రైతులు రత్నాలు పండించే ప్రాజెక్టుగా పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలో బొల్లాపల్లి జలాశయం ఏర్పాటుతో ఆ ప్రాంతంలో కొంతమంది నష్టపోయే పరిస్థితి ఉందని, ఐనా బహుళార్ధ ప్రయోజనాల దృష్ట్యా త్యాగాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. సీఎం చంద్రబాబు విజన్ 2047 సాధించడానికి కూడా లోకేష్ లాంటి నవయువ నాయకత్వం అవసరం ఎంతో ఉందన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా కార్యకరతలకు కొండత అండగా నిలుస్తున్నారన్నారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు 400 రోజులు యువగళం పాదయాత్ర చేపట్టి పార్టీని అధికారంలోకి రావడానికి కృషి చేసిన ఆయన కార్యనిర్వాహక అధ్యక్షపదవి ఇవ్వడం, అది కూడా కడప మహానాడు వేదికగా చేయడం ఎంతో సముచితంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జీడీసీసీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



పులివెందులలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, పక్కన బీటెక్ రవి తదితరులు

సైకిల్‌యాత్ర చేపట్టిన యువతకు అభినందన

వినుకొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ వేదికగా ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహానాడును విజయవంతం చేయాలని కోరుతూ పెనుకొండ నియోజకవర్గానికి చెందిన యువత సైకిల్ యాత్రచేపట్టారు. సైకిల్ యాత్రచేపట్టిన 44మంది పార్టీ యువతను పులివెందుల నియోజకవర్గంలో చేరడంతో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీఆంజనేయులు, ఇన్‌చార్జిబీటెక్ రవి, జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు ఘన స్వాగతం పలికి సైకిల్ యాత్ర చేపడుతున్న యువతను ప్రత్యేకంగా అభినందించారు.

మహానాడుకు భారీగా తరలిరండి

టీడీపీ శ్రేణులకు ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు

చిలకలూరిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా నలుమూలల నుంచి టీడీపీ శ్రేణులు, అభిమానులు కడపలో జరిగే మహానాడుకు భారీ సంఖ్యలో తరలిరావాలని టీడీపీ జనసమీకరణ కమిటీ సభ్యులైన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం కోరారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్ష ఎన్నికతో పాటు అనేక సంస్థాగత నిర్ణయాలకు కేంద్రబిందువు కానున్న మహానాడుకు ఎంతో ప్రత్యేకత ఉన్నదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మహానాడులో యువత, మహిళలు, రైతుల సంక్షేమం సహా రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధే ప్రధాన అజెండాగా పలు నిర్ణయాలను అధినాయకత్వం ప్రకటించనుందని తెలిపారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలన విజయాలు, భవిష్యత్తు ఆలోచనలపై మహానాడులో సమగ్ర చర్చ జరగనుందని వివరించారు. మూడు రోజులు కన్నుల పండువగా జరిగే తెలుగు ప్రజల మహా పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, వర్షం వచ్చినా కార్యకర్తలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు జరిగాయని పేర్కొన్నారు. పోలీస్, రెవెన్యూ తదితర విభాగాలు, స్థానిక నాయకుల సహకారంతో మహానాడుకు వెళ్లే మార్గాల్లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా అన్ని చర్యలు చేపట్టారని కూడా తెలిపారు. మహానాడుకు హాజరయ్యేవారు వారు తిరిగి గమ్యస్థానాలకు చేరేవరకు ప్రయాణంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.

చిలకలూరిపేట నుంచి మహానాడుకు 500 మంది

కడపలో జరిగే మహానాడు చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో 500 మందికి పైగా టీడీపీ శ్రేణులు తరలివెళుతున్నారు. వీరిలో 120మంది ప్రతినిధులు, 102 మంది శాశ్వత సభ్యులు కూడా ఉన్నారు. వీరిలో కొందరు ఇప్పటికే కడపకు చేరుకోగా మిగిలిన వారు మంగళవారం బయలుదేరుతున్నారు. వీరందరికీ కడప - పులివెందుల రోడ్డులో ఉన్న కృష్ణాపురం గ్రామంలోని నారాయణ స్కూల్ హాస్టల్‌లో బస ఏర్పాటు చేశారు. మహానాడు వేదికకు 3.5 కిలోమీటర్ల దూరంలో పార్టీ శ్రేణులకు పార్కింగ్‌తో పాటు వసతి సౌకర్యం కల్పించారు. ఏ విషయంలోనైనా అసౌకర్యం కలిగితే ఎవరిని సంప్రదించాలో పార్టీ శ్రేణులకు వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావు ప్రజల వద్ద నుండి 75ఫిర్యాదులు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి త్వరితగతిన పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని, ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధవహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్పీ సూచించారు. నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామానికి చెందిన తిరువాయిపాటి రవీంద్ర శ్రీనివాసరావు బతుకుతెరువు నిమిత్తం వేరే ప్రాంతంలో నివసిస్తున్నాడు. స్వగ్రామం లింగంగుంట్లలో స్థలం కొనుగోలుచేసి ఇంటిని నిర్మించుకొని రెండు సంవత్సరాల పాటు ఆ ఇంటిలో ఉన్నాడు. జీవనోపాధి కోసం వెళుతూ తన ఇంటిని పది సంవత్సరాల క్రితం పెరంబదూరి ఆంజనేయులుకు అద్దెకు ఇచ్చాడు. ఐదు సంవత్సరాల క్రితం ఆంజనేయులు మరణించగా, ఆయన కుమారుడు లీల రంగప్రసాదుకు అద్దెకు ఇవ్వగా అతను సక్రమంగా అద్దె చెల్లించకుండా ఇబ్బందుల పాలుచేస్తూ, అద్దె అడిగితే తనపై దౌర్జన్యం చేస్తున్నట్లు ఎస్పీ కి ఫిర్యాదు చేశాడు. వినుకొండ స్వీపర్స్ కాలనీకి చెందిన బొప్పూరి రిబ్కకు వెంకట నారాయణ మూర్తి పరిచయమై వినుకొండ జీడీసీసీ బ్యాంకులో పని చేస్తున్నానని నమ్మించి లోన్ ఇప్పిస్తానని, ఫిర్యాదుతో పాటు మరొక తొమ్మిదిమందికి చెప్పి ఒక్కొక్కరి వద్ద 15 వేల రూపాయలు వసూలు చేసి, లోన్ ఇప్పించకుండా ఫిర్యాదుతో పాటు మిగిలిన 9మంది కట్టిన డబ్బులు కూడా ఇవ్వకుండా మోసం చేశాడని తగు న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈపూరు మండలం ఇనుమెళ్ల గ్రామానికి చెందిన నర్రా వేణు బాబుకు ఉద్యోగం ఇప్పిస్తానని బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన వేల్పుల కాటంరాజు అగ్రికల్చరల్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం ఇప్పిస్తానని మహారాష్ట్రలోని కొల్లాపూర్‌కు రమ్మని చెప్పి, అక్కడ ఇంటర్వ్యూ నిమిత్తం 15వేల రూపాయలు ఫీజు కట్టించుకున్నాడు. నెలకు 50వేల నుంచి లక్ష రూపాయల వరకు సంపాదించుకోవచ్చు అని చెప్పి ఒక నెల ట్రైనింగ్ ఇస్తామని చెప్పి మోసం చేసినట్లు ఎస్పీకి అర్జీ ఇచ్చారు. ఈపూరు మండలం కూచనపల్లి గ్రామానికి చెందిన బత్తుల చిరంజీవి అదే గ్రామానికి చెందిన పసుపులేటి అంజిబాబు వద్ద మూడు ఎకరాల పొలం కౌలుకు తీసుకుని మిర్చి పంట సాగు చేశాడు. మిర్చి కోసి కల్లంలో ఆరబోయగా గుర్తు తెలియని వ్యక్తులు సుమారు 15 క్వింటాళ్ల దొంగతనం చేసినట్లు అర్జీ ఇచ్చాడు. రొంపిచర్ల మండలం చాకలికుంట తండా గ్రామ నివాసి కేతావత్ దేవిబాయికు పది సంవత్సరాల క్రితం సత్తెనపల్లి సుగాలి కాలనీకి చెందిన కేతావత్ గోపి నాయక్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు.దేవీభాయి వద్ద ఉన్న బంగారం తనఖా పెట్టి మద్యం సేవించి దీనిపై ప్రశ్నిస్తే హింసిస్తున్నాడని పేర్కొంది. ముగ్గురు పిల్లలను అతని వద్దనే పెట్టుకొని ఇబ్బంది పెడుతున్నాడని, పిల్లల కోసం ఫిర్యాది అన్నయ్య, వదినను పంపగా విడాకులు ఇవ్వకపోతే చంపుతానని బెదిరిస్తున్నాడని ఎస్పీకి అర్జీ ఇచ్చారు.



ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

పోలీసు అధికారులకు యోగా శిక్షణ

నరసరావుపేట లీగల్, మే 26, (ఆంధ్రజ్యోతి), యోగా ప్రాధాన్యాన్ని వివరిస్తూ సోమవారం ఉదయం 6:30 గంటలకు స్థానిక పోలీసులు ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ పోలీస్ స్టేషన్ వద్ద యోగాసనాలు నిర్వహించారు. శిక్షకుడి ఆధ్వర్యంలో ఆరోగ్యానికి అవసరమైన అన్నిరకాల ఆసనాలను పోలీసు అధికారులు అభ్యసించారు. కార్యక్రమంలో ఎస్బీ సంతోష్, నరసరావుపేట డీఎస్పీ కే నాగేశ్వరరావు, ఎస్ఐలు చరణ్, హైమారావు, పలువురు పల్నాడు జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



యోగాసనాల శిక్షణలో పాల్గొన్న పోలీసులు

యోగాంధ్రాకు సహకరించాలి: ఎంపీడీవో

బొల్లాపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో పీ సీతారామయ్య కోరారు. మండల కేంద్రమైన మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం మే 21 నుంచి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలు చేపడుతున్నామని, ఇందుకు ప్రతి గ్రామంలో యోగా కార్యక్రమాలు నిర్వహించాలని, అందుకు ఆయా గ్రామాల అధికారులు తమవంతు కృషి చేయాలన్నారు. ప్రతి మండలం నుంచి ఇద్దరు ఉద్యోగులను ఎంపికచేసి వారికి యోగా గురించి శిక్షణ ఇస్తారని, వారు మండలంలో ప్రతి గ్రామానికి ఇద్దరిని ఎంపిక చేసి వారికి శిక్షణ ఇస్తారన్నారు. యోగా వల్ల లాభాలు గురించి వివరిస్తారన్నారు.



కడపలో జరుగుతున్న మహానాడు ఏర్పాట్లపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



కడపలో జరుగుతున్న మహానాడు ఏర్పాట్లపై జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్‌కు బాధ్యతలు అప్పగించాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ బాధ్యతలు లోకేశ్‌కు అప్పగించాలని, అలా చేస్తే 40ఏళ్లపాటు పార్టీకి తిరుగుండదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీడీపీకి అసలైన మార్గదర్శి, సరైన లక్ష్యసాధకుడు లోకేశ్ అని అన్నారు. సమర్థత, ప్రతిభతో ప్రభుత్వంలో, పార్టీలో ఇప్పటికే లోకేశ్ తానేంటో నిరూపించుకున్నాడని పేర్కొన్నారు. జగన్ కక్షసాధింపులో భాగంగా తప్పుడు కేసులో చంద్రబాబు నాయుడు జైల్లో ఉన్నప్పుడు, ఏమాత్రం వెనకడుగు వేయకుండా లోకేశ్ వైసీపీ ప్రభుత్వ దుర్మార్గ పాలనపై పోరాడాడని, సంక్షోభాలు, సవాళ్లను చాలెంజ్‌గా తీసుకొని యువగళం పాదయాత్రతో లోకేశ్ కార్యకర్తల హృదయాలు గెలుచుకున్నాడని వివరించారు. తన ఆలోచనలకు సాంకేతిక పరిజ్ఞానం జోడించి పార్టీ సభ్యత్వ నమోదును కొత్తపుంతలు తొక్కించడమే కాక రికార్డు స్థాయిలో టీడీపీ సభ్యత్వాలు కోటి మార్కు దాటడం వెనుక లోకేశ్ కృషి ఎంతో ఉందని వివరించారు. కార్యకర్తలకు రూ.5లక్షల ప్రమాద బీమా కల్పించి, వారి కుటుంబాలకు పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందనే భరోసా కల్పించాడన్నారు. కూటమి ప్రభుత్వంలో మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు చేసిన తొలి సంతకాన్ని నిలబెట్టుకుంటూ ఇప్పటికే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయించారన్నారు. అధికార మదంతో గతంలో ఇష్టానుసారం నోళ్లు పారేసుకున్న వైసీపీ నేతలకు లోకేశ్ సింహ స్వప్నంగా మారాడని అని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

తెలుగుదేశం పార్టీకి పెద్ద పండుగ మహానాడు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీకి పెద్ద పండుగ మహానాడు అని, ఈ కార్యక్రమాన్ని 27, 28, 29 తేదీలలో నిర్వహిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ముఖ్యంగా 29వ తేదీన గొప్ప బహిరంగ సభ జరుగుతుందన్నారు. బహిరంగ సభకు దాదాపుగా 5లక్షల నుంచి 6లక్షల వరకు కార్యకర్తలు హాజరవుతారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెద్దఎత్తున కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి 10వేల మంది కార్యకర్తలు, నాయకులు, మహిళలు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కడపలో అన్ని ఏర్పాట్లు ఘనంగా జరిగాయన్నారు. నరసరావుపేట నుంచి బస్సులు, వాహనాలు ఏర్పాటు చేశామని, కడపలో ఉండటానికి వసతులు కూడా ఉన్నాయన్నారు. మహానాడులో హెల్త్ క్యాంపునకు తనను ఇన్‌చార్జిగా నియమించారని అరవిందబాబు చెప్పారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గట్టుపల్లి సత్యనారాయణ, నరసరావుపేట, రొంపిచర్ల మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు, పల్లెల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరవిందబాబును కలసిన మండల టీడీపీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రొంపిచర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్‌లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబును సోమవారం నరసరావుపేటలోని పార్టీ కార్యాలయంలో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఇంటూరి ప్రసాదు, చల్లా సుబ్బారావు, మొండితోక రామారావు, జాష్టి ప్రసాదు, గరికపాటి తాతయ్య, శాఖమూరి రామ్మూర్తి, యాంపాటి కోటిరెడ్డి, మామిళ్ళపల్లి ఆదిబాబు, పేరుపోగు దాసు తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ ఖాతాలతో ప్రభుత్వ పథకాల లబ్ధి

చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ ప్రకాష్

నరసరావుపేట టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాల నగదు బదిలీ కోసం ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ అనుసంధానం, ఎన్‌పీసీఐ లింకేజ్ తప్పనిసరి అని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ప్రకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రారంభించదలచిన సంక్షేమ పథకాలు తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాల నగదు నేరుగా బ్యాంక్ ఖాతాకు జమ చేసేందుకు ఎన్‌పీసీఐ మ్యాపింగ్‌లో ఆధార్‌కు బ్యాంక్ అకౌంట్ మ్యాపింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. అయితే మన రాష్ట్రంలో సుమారు 51లక్షల మందికి బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ లేని కారణంగా గత ఏడాదిలోనే జీఎస్‌డబ్ల్యూఎస్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కొంత పురోగతి సాధించిన విషయం తెలిసిందే అన్నారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్‌ను సచివాలయ యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమన్వయంతో జూన్ 5వ తేదీలోగా అందరికీ ఆధార్ సీడింగ్‌తో పాటు ఎన్‌పీసీఐ లింకేజ్ చేస్తూ ఖాతాలను ఓపెన్ చేయడం ద్వారా సంక్షేమ పథక ఫలితాలు ఇబ్బందుల్లేకుండా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈ ఆధార్ సీడింగ్ జరిగిన ఐపీపీబీ ఖాతాలో జమైన పథకాల నగదును ఏ పోస్టు ఆఫీస్‌లో అయినా తీసుకునే సదుపాయంతో పాటు ఫోన్‌పే, గూగుల్ పేకు లింక్ చేసుకొని ఆన్‌లైన్ ట్రాన్స్‌క్షన్స్ ఎన్‌ఈఎఫ్‌టీ, ఐఎంపీఎస్, యూపీఐ కూడా చేసుకునే సౌకర్యం కూడా ఉందన్నారు. ఆధార్ సీడింగ్ (ఎన్‌పీసీఐ మ్యాపింగ్) కాని వారు తమ దగ్గరలోని పోస్టు ఆఫీస్‌ను సంప్రదించి ఐపీపీబీ అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని నరసరావుపేట డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ పీ వెంకటస్వామి అన్నారు.

డొంక మార్గం సర్వే చేయాలని వినతి

యడ్లపాడు, మే 26 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు గ్రామ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి నుంచి విశ్వనాధునికండ్రిక వరకు గల డొంక మార్గాన్ని సర్వే చేయించి హద్దురాళ్ళు ఏర్పాటు చేయాలని జాలాది నీటి సంఘం అధ్యక్షుడు పోపూరి రాఘవయ్య, మాజీ గ్రామ ఉపసర్పంచ్ ముత్తవరపు సుబ్బారావులు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. విశ్వనాధునికండ్రిక అగ్రహార భూములకు వెళ్ళేందుకు జాతీయ రహదారి నుంచి డొంక మార్గం ఆక్రమణలకు గురైందని, ప్రస్తుతం పొలాలకు వెళ్ళేందుకు దారిలేకుండా పోయిందన్నారు. రెవెన్యూ రికార్డుల దాఖలా సర్వే నం.1లో డొంకమార్గం ఉందన్నారు. ఈ విషయమై పంచాయితీ వారు గత నెల 4న జరిగిన సమావేశంలో సదరు అంశాన్ని ప్రవేశపెట్టి సర్వే చేయాలని కోరుతూ తీర్మానం నెం.12ద్వారా ఆమోదించడం జరిగిందన్నారు. సదరు తీర్మానం కాపీని కూడా తహసీల్దార్‌కు అందించారు. కాగా ఉన్నవ గ్రామానికి చెందిన రైతు తన పొలం సర్వే చేయించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరుతూ మరో అర్జీని అందజేశారు.